# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 13 ఆగస్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 220 | పేజీలు: 8+4 | వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


నోట్ల కట్టల న్యాయమూర్తి వ్యవహారం

## జస్టిస్ వర్మపై ఆరోపణలు నిరూపితం



2

## మీరు చనిపోయినందుకు సంతోషం!?!



2



5

## పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన టూరిజం ఎండీ

ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) మేనేజింగ్ డైరెక్టర్గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి పట్టన్ శెట్టి రవి సుభాష్ సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగాభివృద్ధికి తీసుకోవాల్సిన పలు కీలక చర్యలపై వారిద్దరి...



4

## పారిశ్రామిక ప్రగతికి ఏపీ సరికొత్త అడుగులు

చెన్నై-కోయంబత్తూర్ సదస్సుల్లో పెట్టుబడుల వెల్లువ

ఏపీలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల ఆసక్తి

సిఐఐ పార్టనర్షిప్ సమిట్‌కు అంతా సానుకూలం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

'సిఐఐ పార్టనర్షిప్ సమిట్ 2026 'కి ముందుగా చేపడుతున్న పెట్టుబడుల ప్రోత్సాహక కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' (సిఐఐ) భాగస్వామ్యంతో...



2

## కొలంబియా భూకంపంలో 3 వేల మంది గల్లంతు!

### మృతుల సంఖ్య 224

దక్షిణ అమెరికా దేశమైన కొలంబియాను సోమవారం నాటి భారీ భూకంప విషాదం కుదిపేస్తోంది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.4గా నమోదు కాగా, ఈ విలయంలో ఇప్పటివరకు 224 మంది ప్రాణాలు కోల్పోయారు. 3,000 మందికి పైగా గల్లంతు కాగా, వీరి కోసం మంగళవారం గాలింపు చర్యలు కొనసాగాయి. పశ్చిమ కొలంబియాలోని పలు నగరాలు, పట్టణాల్లో ఇప్పటికీ శిథిలాల కింద...



# ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్

## సీఎం చంద్రబాబు ప్రయారిటీ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షలు, కేబినెట్ తదుపరి కార్యాచరణలపై బిజీ షెడ్యూల్లో గడిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, సీఆర్డీఏ ప్రాజెక్టుల వేగవంతం, మరియు వ్యవసాయ రంగ ప్రణాళికలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు.

■ పి.మీరాహుస్సే ఖాన్

**అమరావతి, (మనం ప్రత్యేక ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాలు సుదీర్ఘంగా సాగాయి. కేబినెట్ సమావేశంలో ఆమోదించిన 34 కీలక ఎజెండా అంశాలు, ప్రధానంగా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్ 2026' అమలు తదుపరి కార్యాచరణపై సీఎం దిశా నిర్దేశం చేశారు. అమరావతి రాజధాని ప్రాంతంలో మౌలిక వసతులు, సీఆర్డీఏ పరిధిలోని ప్రాజెక్టుల పురోగతితో పాటు, రాష్ట్రంలో ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితిపై డీజీపీ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పునర్నిర్మాణంలో ఏ ఒక్క క్షణాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సీఎం వరుస సమీక్షలుమంత్రివర్గ సమావేశం ముగిసిన మరుసటి రోజే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా వ్యవహారాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. బుధవారం మధ్యాహ్నం 2:30 గంటలకు సీఆర్డీఏ ఉన్నత స్థాయి సమావేశం సీఎం అధ్యక్షతన ప్రారంభమైంది. అమరావతిలో నిర్మిస్తున్న కీలక భవనాలు, రెండు నూతన స్టీల్ బ్రిడ్జిలు, సీడ్ యాక్సెస్ రోడ్డు పనుల ప్రారంభోత్సవ ఏర్పాట్లపై మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణతో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు.

**విశాఖ ఎకనామిక్ రీజియన్‌పై ప్రత్యేక నిఘా**

రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఊతమిచ్చేలా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక సమీక్ష చేపట్టారు. ఉత్తరాంధ్ర పరిధిలో పారిశ్రామిక హబ్ల ఏర్పాటు, కొత్త పెట్టుబడుల ఆకర్షణ, మరియు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు

...మిగతా 2లో


# ఉప్పాడ తీర రక్షణకు ఐఐటీ-మద్రాస్తో ఎం.ఒ.యు

### రూ.323 కోట్లతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో ఒప్పందం

రక్షణ గోడ డిజైన్, డీపీఆర్, పర్యవేక్షణ బాధ్యతలు చూడనున్న ఐఐటీ మద్రాస్

నవంబర్ నుంచి పనులకు శ్రీకారం



**అమరావతి,ఆగస్టు,12,(మనం ప్రత్యేక ప్రతినిధి):** సముద్ర కోతతో తీవ్రంగా దెబ్బ తింటున్న ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణకు కీలక ముందడుగు పండింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్), సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ - మద్రాస్కు అప్పగిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. రూ.323 కోట్లతో ఈ తీర

...మిగతా 2లో

# రాజధానికి.. ఇక రయ్ రయ్ రారా..

సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభించనున్న సీఎం

2

3 దశల్లో రూ.1,519 కోట్లతో ఇ-3 రహదారి నిర్మాణం

# డిసెంబరు 1 నాటికి 95-95-99 లక్ష్యాల సాధన



ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ధ్యేయం

వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు

60 రోజుల ప్రత్యేక అవగాహన ప్రచారాన్ని ప్రారంభించిన మంత్రి

డిజిటల్ పర్యవేక్షణకు 'సురక్ష' డ్యాష్‌బోర్డు ఆవిష్కరణ

**విజయవాడ,ఆగస్టు, 12,(మనం బ్యూరో):** హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, 2026 డిసెంబరు 1 నాటికి నిర్దేశిత '95-95-99' లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ సాధనలో యువతతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ శాక్స్) ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన '60 రోజుల ప్రత్యేక సమాచార, విద్య, ప్రచారం పేరుతో తయారు చేసిన కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ నియంత్రణలో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. గతంతో పోలిస్తే కొత్త హెచ్ఐవీ ఇన్ఫెక్షన్లు 77 శాతం, మరణాలు 87 శాతం తగ్గడం ఇందుకు

...మిగతా 2లో



# ఆక్వా రంగానికి కూటమి ప్రభుత్వం భరోసా

నిబంధనలతో ఆక్వారంగాన్ని నాశనం చేసిన జగన్

- ప్రతి రైతుకి లబ్ధి చేకూరేలా జోన్ల విధానం, నిబంధనలు ఎత్తివేత
- ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు
- పాలకొల్లులో ఆక్వా రైతుల భారీ బహిరంగ సభ
- వేలాదిగా తరలివచ్చిన రైతులు

**పాలకొల్లు, ఆగష్టు 12 మనం ప్రతినిధి:** సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు రూపాయిన్నరకే కరెంటు ఇస్తూ కూటమి ప్రభుత్వం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జీవో నెంబర్ 57 విడుదల చేసింది. దేశం, రాష్టం లోనే మొట్టమొదటి సారిగా బహిరంగ వేదిక పై ఆక్వా రైతుల ఆనంద పరవశం మధ్య మంగళవారం ఉదయం పాలకొల్లులో బ్రాడీపేట బైపాస్ రోడ్డు రామచంద్ర గార్డెన్ వద్ద జరిగిన రాష్ట్ర ఆక్వా రైతుల కృతజ్ఞత బహిరంగ సభలో

...మిగతా 2లో

# మన సభ-జన సభ

### అమరావతి అసెంబ్లీలో ప్రజలతో కలిసి స్వాతంత్ర్య సంబరాలు

ఇకపై ప్రతి ఏటా 4రోజుల పాటు సామాన్యులకు సైతం అసెంబ్లీ సందర్శన

ఆగస్టు 15, జనవరి 26 వేడుకల నిర్వహణకు సామాన్యులకు ఆహ్వానం

ఆగస్టు 14, 15 తేదీల్లో సాయంత్రం వేళల్లో ప్రజలు, విద్యార్థుల సందర్శనకు పిలుపు

రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు



**అమరావతి,ఆగస్టు,12,(మనం ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్ర శాసన సభ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టానికి శ్రీకారం చుడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజా పండుగలా నిర్వహించేందుకు అమరావతి అసెంబ్లీ ప్రాంగణం సిద్ధమౌతోంది.కేవలం విద్యుత్ దీపాల అలంకరణలు, అధికారుల జెండా వందనానికే పరిమితం కాకుండా సామాన్య ప్రజలను, విద్యార్థులను భాగస్వాములను చేయాలని శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన నిర్ణయం తీసుకున్నారు.గతంలో మాజీ సియం నందమూరి తారకరామారావు తరచూ చెప్పేమన సభ-జన సభ అనే స్ఫూర్తితో అసెంబ్లీ గేట్లను ప్రజల కోసం తెరవనున్నట్లు ఆయన ప్రకటించారు.ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలోని తన కార్యాయలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమవేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 14,15 తేదీలలో సాయంత్రం వేళల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు సకుటుంబంగా వచ్చి

...మిగతా 2లో

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా మరో అడుగు

### మాతా, శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి 18 బ్రాండ్ న్యూ ఏసీ వాహనాలు

102 కాల్ సెంటర్ సదుపాయం ద్వారా మెరుగైన వైద్య సేవలు: మంత్రి



2

# మోదీ సహకారం.. కూటమి ప్రభుత్వ కృషి..

- అంతర్జాతీయ గుర్తింపు పొందనున్న అమరావతి
- బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



4

# ఈ నెలాఖరులో వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌కి కృష్ణా జలాలు

- వెలుగొండ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష

**అమరావతి,12,(మనం ప్రతినిధి):** ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభించనున్న నేపథ్యంలో.. ఆ ఏర్పాట్లపై మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్ లు మార్కాపురం జిల్లా కలెక్టర్, ఆ ప్రాంత ఎమ్మెల్యేలు, టీడీపీ ఇంచార్జ్ లతో బుధవారం జూమ్ వేదికగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ..ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబు

...మిగతా 2లో

# మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

**అమరావతి,ఆగస్టు,12,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్లోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లకు వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితాలను 03 సెప్టెంబర్ 2026న ప్రచురించనున్నట్లు కమిషన్ ప్రకటించింది.ఈ ఓటర్ల జాబితాలను మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఉపయోగిస్తారు. మేయర్, వార్డు సభ్యుల సీట్ల రిజర్వేషన్ను ఖరారు

...మిగతా 2లో

# నోట్ల కట్టల న్యాయమూర్తి వ్యవహారం

## జస్టిస్ వర్మపై ఆరోపణలు నిరూపితం పార్లమెంటు ముందుకు నివేదిక

**ఢిల్లీ, ఆగష్టు 12:** జస్టిస్ యశ్వంత్ వర్మ అధికార నివాసంలో కాలిన కరెన్సీ నోట్లు బహిర్గతమైన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల కమిటీ దర్యాప్తు నివేదిక బుధవారం పార్లమెంటు ముందుకు వచ్చింది. నగదు లెక్క చూపకపోవడం, సాక్ష్యాధారాలు చెదిరిపోవడం, వివరణలో దాటవేత ధోరణి అనే ఆరోపణలు నిరూపితమయ్యాయని నివేదిక తేల్చింది.

ఆ నగదు అక్కడ ఎందుకు ఉంది? అది ఎవరిది? ఎక్కడి నుంచి వచ్చింది? అనే ప్రశ్నలకు జస్టిస్ యశ్వంత్ వర్మ సరైన వివరణ ఇవ్వలేకపోయారు. చట్టపరమైన తనిఖీలు, సీలింగ్ కు ముందు భౌతిక సాక్ష్యాధారాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించలేదు. స్టోర్ రూమ్ లో సాక్ష్యాధారాల స్థితి చెదిరిపోయింది. ఈ వ్యవహారంలో జస్టిస్ వర్మ ఇచ్చిన వివరణలో నిష్పాక్షికత, పారదర్శకత, బాధ్యత కనిపించలేదు. అది దాటవేత ధోరణిలో, అసంతృప్తికరంగా ఉంది'' అని కమిటీ తన నివేదికలో తెలిపింది.

# మీరు చనిపోయినందుకు సంతోషం!?!

**రాయ్ పూర్, ఆగష్టు 12:** 'మా ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని.. కోలుకొని వెళ్లినందుకు సంతోషం' అంటూ చనిపోయిన పేషెంట్ ఫోన్‌కు ఓ ఆస్పత్రి మెసేజ్ పంపింది. ఆ రోగి అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 42 రోజుల క్రితమే ప్రాణాలు కోల్పోవడం ఈ సందర్భంగా గమనార్హం. ఛత్తీస్ గఢ్ లోని రాయ్ పూర్ లో వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబసభ్యులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాయ్ పూర్ కు చెందిన కానిస్టేబుల్ దేవనారాయణ్ రామ్ (39) అనారోగ్య కారణాలతో జూన్ 26న అంబికాపూర్లోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేరారు. అదే హాస్పిటల్లో ఆయన భార్య సీమా నర్సుగా పని చేస్తున్నారు. చికిత్స పొందుతూ దేవనారాయణ్.. అదే నెల 30న ప్రాణాలు కోల్పోయారు. దానితో కుటుంబ సభ్యులు ఆయనకు అంత్యక్రియలు నిర్వహించి.. మరణ ధ్రువీకరణ పత్రం సైతం తీసుకున్నారు. దేవనారాయణ్ మరణించిన నెల రోజుల తర్వాత ఆగస్టు 6న ఆయుష్మాన్ భారత్ పథకం కింద మృతుడి ఫోన్ కు ఆస్పత్రి నుంచి ఒక సందేశం వచ్చింది. అందులో 'ప్రియమైన దేవనారాయణ్ మీరు మా ఆసుపత్రిలో చికిత్స తీసుకొని.. కోలుకొని వెళ్లినందుకు సంతోషంగా ఉంది. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద అందించే ఉచిత ఆరోగ్య సంరక్షణ సేవలతో మీరు సంతృప్తి చెందారని ఆశిస్తున్నాం' అని అందులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబం ఆసుపత్రి దృష్టికి తీసుకువెళ్లగా.. డేటా ఎంట్రీ ఆపరేటర్ తప్పిదం వల్ల ఈ పొరపాటు జరిగిందని అధికారులు పేర్కొన్నారు. ఈ తప్పిదం చేసినందుకు అతడిని విధుల నుంచి తొలగించినట్లు వెల్లడించారు. అయితే, కానిస్టేబుల్ కుటుంబం మాత్రం ఈ వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తం చేసింది. తన భర్త జూన్ 30న ప్రాణాలు కోల్పోతే.. ఏప్రిల్ 6న డిశ్చార్జ్ అయినట్లు మెసేజ్ వచ్చిందని సీమా పేర్కొన్నారు. మరణానంతరం తన భర్త ఆయుష్మాన్ కార్డును ఆసుపత్రి వర్గాలు దుర్వినియోగం చేశాయని ఆమె ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ఆమె ఆరోపణలను ఆసుపత్రి యాజమాన్యం ఖండించింది. పోర్టల్లో ఆయుష్మాన్ క్లెయిమ్ను మూసివేయడంలో జాప్యం చోటుచేసుకోవడం వల్లే ఈ సందేశం ఆలస్యంగా వచ్చిందని తెలిపింది. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

# మన సభ–జన సభ

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ విద్యుత్ కాంతులను వీక్షించవచ్చని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సాయంత్రం వేళల్లో ప్రత్యేక పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలు, స్వాతంత్ర్య పోరాట త్యాగాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.నేటి తరం పిల్లల తోపాటు భావితరాలకు దేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర,దేశ ఔన్నత్యం గురించి తెలియాలనే ఉద్దేశంతో విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని, వీలును బట్టి వారిని అసెంబ్లీ మెయిన్ హాల్ సందర్శనకు కూడా అనుమతిస్తామని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అసెంబ్లీ సందర్శనలో భాగంగా పరిమితంగా ఆన్ పేమెంట్ ప్రాతిపదికన ఫుడ్ కోర్టులు సైతం ఏర్పాటుకు అనుమతి ఇచ్చామని తెలిపారు. అయితే ప్రాంగణంలో ఫోన్లతో రీల్స్ చేయడం వంటి వాటిపై భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని నిబంధనలు విధిస్తామన్నారు.ఈనెల 17 నుండి మొదలయ్యే అసెంబ్లీ సమావేశాలను సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై ఈనెల 14వతేది ఉదయం సిఎస్ సహా ఇతర కార్యదర్శులు,డిజిపి సహా పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్టు శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు మీడియాకు వివరించారు.

అసెంబ్లీకి రాని వారికి జీతం ఎందుకు? కేంద్రం దీనిపై చట్టం తేవాలి:స్పీకర్ అభిప్రాయం

శాసనసభ సమావేశాలకు హాజరుకాని ప్రజా ప్రతినిధుల వైఖరిపై శాసన సభాపతి సిహెచ్.అయ్యన్నపాత్రుడు అసంతృప్తి వ్యక్తం చేశారు.సాధారణ ఉద్యోగి విధులకు వెళ్లకపోతే ఆసంస్థ లేదా కంపెనీ జీతం ఇవ్వదని, ప్రజల సమస్యలు చర్చించడమే ప్రాథమిక విధిగా ఉన్న ఎమ్మెల్యేలు సభకు రాకుండా వేతనాలు,భత్యాలు ఎలా డిమాండ్ చేస్తారని ప్రశ్నించారు. గతంలో సభకు రాకుండా నాలుగైదు రోజుల తర్వాత వచ్చి సంతకాలు చేసే దొంగ పద్ధతి ఉండేదని దానికి స్వస్తి పలుకుతూ తమ హయాంలో 'డిజిటల్ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్' విధానం అమలులోకి తెస్తున్నామన్నారు.సభ్యులు కేటాయించిన సీట్లో కూర్చుంటేనే హాజరు పడుతుందన్నారు.సభకు హాజరుకాని ఎమ్మెల్యేల విషయమై తగు నిర్ణయం తీసుకోవాల్సిందిగా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని వారి ఆదేశాల కోసం వేసి చూస్తున్నామని అన్నారు.

# డిసెంబరు 1 నాటికి 95-95-99 లక్ష్యాల సాధన

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శనమన్నారు. ఈ క్రమంలో అంచనా వేసిన హెచ్ఐవి బాధితుల్లో 95 శాతం మందికి హెచ్ ఐవి వచ్చినట్లు తెలిసి ఉండాలని, తెలిసిన వారిలో 95 శాతం మంది మందులు వాడుతూ ఉండాలని, మందులు వాడే వారిలో 99 శాతం మందికి వైరల్ లోడ్ బాగా తగ్గి ఉండాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. ఈ మూడు కేటగిరీల్లో రాష్ట్ర ప్రభుత్వం 88-87-96.2 శాతం మేర పురోగతిని సాధించిందని చెప్పారు. మిగిలిన లక్ష్యాన్ని(95-95-99) డిసెంబరు 1 గడువులోగా లక్ష్యాన్ని సాధించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

### డిసెంబరు లక్ష్యంపై కేంద్రీకృత కార్యాచరణ

ఈ మూడు దశల్లో ఎక్కడ లోటు ఉందో గుర్తించి.. అక్కడే ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ లక్ష్యాల సాధనలో యువతను ప్రధాన భాగస్వామ్యం చేయాలని, సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

### 'సురక్ష'తో జిల్లాల వారీగా పర్యవేక్షణ

హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల పురోగతిని, జిల్లాల వారీగా ఉన్న లోటుపాట్లను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు తయారు చేసిన ₹'సురక్ష డ్యాష్బోర్డ్'₹ను మంత్రి ఆవిష్కరించారు. దీని ద్వారా ఏ జిల్లాలో పురోగతి ఎలా ఉంది? ఎక్కడ లోటు ఉంది? ఎక్కడ ప్రత్యేక దృష్టి అవసరం? ఏ ప్రాంతాల్లో చర్యలను వేగవంతం చేయాలి? వంటి అంశాలను గుర్తించి తదనుగుణంగా కార్యాచరణ చేపట్టే అవకాశం ఉంటుంది.

### యువతతో 60 రోజుల ప్రత్యేక ప్రచారం

రాబోయే 60 రోజుల పాటు గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ తెలిపారు.ఎయిడ్స్ రహిత దేశం కోసం సన్నద్ధీకరణలో భాగంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మార్గదర్శకాల ప్రకారం డిసెంబరు నాటికి 'సురక్షిత్ , సురక్షిత్ ప్లస్' లక్ష్యాలను సాధించే దిశగా కార్యాచరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. జానపద కళాజాతాలు, సామాజిక మాధ్యమాలు, కరపత్రాల ద్వారా ప్రచారాన్ని నిర్వహించాలని తెలిపారు.

### తల్లి నుంచి బిడ్డకు సంక్రమణ నివారణ

గర్భిణీలకు ముందస్తుగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి.. అవసరమైన వైద్య సేవలు, చికిత్స అందించడం ద్వారా తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమించకుండా చర్యలు తీసుకోనున్నట్లు ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు తెలిపారు. అవసరమైన వారికి సకాలంలో చికిత్స అందేలా సేవలను బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు.

### ఏఆర్టీ కేంద్రాల పనితీరుపై సమీక్ష

జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ఏఆర్టీ కేంద్రాల పనితీరును సమీక్షించడంతో పాటు.. చికిత్స పొందుతున్న వారి కొనసాగింపును పర్యవేక్షిస్తున్నామని ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ స్మరణ్ రాజ్ తెలిపారు. హెచ్ఐవీ నిర్ధారణ అయిన వారికి చికిత్స అందేలా, చికిత్సలో ఉన్నవారికి నిరంతర సేవలు అందేలా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. రాబోయే 60 రోజుల్లో చేపట్టే ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థలు, వల్నరబుల్ వర్గాల వరకు విస్తరించనున్నారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, వైద్య సిబ్బంది, విద్యాసంస్థలు, ప్రసార మాధ్యమాల భాగస్వామ్యంతో ప్రచారాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్తామన్నారు.

# రాజధానికి.. ఇక రయ్ రయ్ రారా..

**అమరావతి,ఆగస్టు,12,(మనం ప్రత్యేక ప్రతినిధి):** రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రాజధాని రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలవనున్న ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్, బకింగ్హామ్ కెన్నా నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ప్రారంభించనున్నారు. దీంతో రాజధానిలోకి రాకపోకలు మరింత వేగవంతం, సులభతరం కానున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచస్థాయి ప్రమాణాలతో గ్రిడ్ తరహాలో అభివృద్ధి చేస్తున్న అమరావతి రాజధాని రహదారుల నిర్మాణానికి ఈ ప్రాజెక్టు కీలక ముందడుగుగా నిలవనుంది.

### 34 రహదారులు... 350 కి.మీ

అమరావతిలోని ఎన్-1 నుంచి ఎన్-17 వరకు ఉన్న అన్ని ఎన్-సిరీస్ రహదారులను ఇ-3 అనుసంధానించనుంది. ఉత్తరం నుంచి దక్షిణం, తూర్పు నుంచి పడమర దిశల్లో గ్రిడ్ తరహాలో రహదారులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అనవసర మలుపులు లేకుండా రాజధాని ప్రాంతంలోకి నేరుగా చేరుకునేలా ఈ రహదారి వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇ, ఎన్ సిరీస్ రోడ్లలో కలిపి 34 ప్రధాన రహదారులు... మొత్తం 350 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతోంది. భవిష్యత్లో పెరగనున్న ట్రాఫిక్ను దృష్టిలో పెట్టుకుని రాజధాని రవాణా వ్యవస్థకు పటిష్ఠమైన పునాది వేస్తున్నారు. దొండపాడు నుంచి ప్రారంభమయ్యే ఇ-3 రోడ్డు రాయపూడి, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి మీదుగా మణిపాల్ హాస్పిటల్స్ వద్ద గ్రాఏ-16ను కలుపుతుంది. 21.77 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి నిర్మాణానికి రూ.1,519 కోట్లు వెచ్చిస్తున్నారు. 60 మీటర్ల వెడల్పుతో మూడు దశల్లో నిర్మిస్తున్న ఈ కారిడార్లో 9 లేన్ల రహదారి, ప్రత్యేక బీఆర్టీఎస్ కారిడార్, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. డ్రైనేజీ, మంచినీటి సరఫరా, గ్యాస్, విద్యుత్ నెట్వర్క్లకు అవసరమైన మౌలిక వసతులను కూడా రహదారి నిర్మాణంతోపాటే కల్పిస్తున్నారు. సైకిల్ ట్రాక్లు, ఫుట్పాత్లు, గ్రీన్బెల్టతో ఇ-3ను ఆధునిక నగర రహదారిగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది.

### బకింగ్ హామ్ కెన్నా ఉక్కు వంతెన

ఇ-3 రోడ్డును విజయవాడ-మంగళగిరి హైవేతో అనుసంధానించేందుకు బకింగ్హామ్ కెన్నా రూ.82 కోట్లతో 478 మీటర్ల పొడవున నాలుగు వరుసల స్టీల్ బ్రిడ్జిని ప్రభుత్వం నిర్మించింది.

దీనిని కూడా సీఎం చంద్రబాబు రేపు ప్రారంభించనున్నారు.

వంతెన అందుబాటులోకి రావడంతో విజయవాడ నుంచి అమరావతికి రాకపోకలకు మెరుగైన మార్గం ఏర్పడుతుంది.

కరకట్ట రోడ్డుపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గిస్తూ.. వాహనాలు సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా నేరుగా అమరావతికి చేరుకునే అవకాశం కలుగుతుంది.

# ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు.వ్యవసాయ రంగంపై ఈవినింగ్ రివ్యూ, సాయంత్రం 5:30 గంటలకు వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, జలాశయాల్లోకి వస్తున్న వరద నీటి లభ్యత, ముఖ్యంగా శ్రీశైలం ప్రాజెక్టు ఇన్-ఫ్లో ఆధారంగా ఖరీఫ్ పంటల ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడాలని, వ్యవసాయ అనుబంధ రంగాలను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సమీక్షించారు. ప్రజల రక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, చట్టాన్ని అతిక్రమించే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 అక్రమాలపై సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి విచారణను వేగవంతం చేయాలని సీఎం స్పష్టం చేశారు.



కొలంబియా భూకంపంలో

# 3 వేల మంది గల్లంతు!

**బొగోటా,ఆగష్టు 12:** దక్షిణ అమెరికా దేశమైన కొలంబియాను సోమవారం నాటి భారీ భూకంప విషాదం కుదిపేస్తోంది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.4గా నమోదు కాగా, ఈ విలయంలో ఇప్పటివరకు 224 మంది ప్రాణాలు కోల్పోయారు. 3,000 మందికి పైగా గల్లంతు కాగా, వీరి కోసం మంగళవారం గాలింపు చర్యలు కొనసాగాయి. పశ్చిమ కొలంబియాలోని పలు నగరాలు, పట్టణాల్లో ఇప్పటికీ శిథిలాల కింద ఎంతోమంది చిక్కుకొని ఉన్నారు. భూకంప తీవ్రత వల్ల సుమారు 1,600 భవనాలు దెబ్బతిన్నట్లు ప్రభుత్వం తెలిపింది. పెరీరా నగరం భూకంప ధాటికి ఎక్కువగా ప్రభావితమైంది. ఈ ప్రాంతంలో పెద్దసంఖ్యలో జనం చనిపోయినట్లు అధికారులు తెలిపారు. కాఫీ సాగుకు ప్రసిద్ధి చెందిన పర్వత ప్రాంతం మానిజాలెస్ నగరంలోనూ ప్రాణనష్టం వాటిల్లింది.

# ఉప్పాడ తీర రక్షణకు ఐఐటీ–మద్రాస్తో ఎం.ఒ.యు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంత రక్షణ గోడ నిర్మాణం కానుంది. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్.డి.ఎమ్.ఎఫ్) ఆమోదంతో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్.డి.ఎమ్.ఎ.) నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో అమలు చేసే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీ మారిటైమ్ బోర్డు బాధ్యతలు నిర్వహించనుంది.ఐఐటీ మద్రాస్ నిపుణుల సాంకేతిక సూచనలు, శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ఉప్పాడ తీర ప్రాంతానికి అనువైన రక్షణ చర్యలను రూపొందించనున్నారు. తీర కోత తీవ్రత, సముద్ర ప్రవాహాలు, అలల ప్రభావం తదితర అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా తీర రక్షణ నిర్మాణాల డిజైన్ను సిద్ధం చేయనున్నారు.

### నవంబర్ నుంచి పనులు ప్రారంభం

ఐఐటీ మద్రాస్తో అధికారిక ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ పూర్తికావడంతో, రానున్న నవంబర్ నుంచి ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకార గ్రామాల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎమ్.ఎన్.హరేంధిర ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ శరవణన్, పాడా డైరెక్టర్ డా. ఎన్.వి. శివరామ ప్రసాద్, ఐఐటీ మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎ.సన్నాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ జి.వి.రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా రంగానికి కూటమి ప్రభుత్వం భరోసా

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్తు,వ్యవసాయ, మత్స్య శాఖ, ఇరిగేషన్ మంత్రులు.. గొట్టిపాటి రవికుమార్, అచ్చన్నాయుడు, నిమ్మల రామానాయుడు, ఆక్వా రంగంతో సంబంధం ఉన్న ఎమ్మెల్యేలు, అనేక మంది ప్రముఖుల మధ్య సబ్సిడీ కరెంట్ జీవో విడుదల చేశారు. వేలాదిగా తరలివచ్చిన రైతులు హర్షమోదలు వ్యక్తం చేశారు. సభకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షత వహించారు. 2019-24 మధ్య జగన్ అరాచక పాలనలో ఆక్వా రంగం కుదేలు అయిపోయిందని వక్తలు ఆవేదన చెందారు. పాదయాత్రలో రూపాయిన్నరకే కరెంటు ఇస్తానని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత మడమతిప్పి మాట మార్చాడని దుయ్యబట్టారు. ఆక్వాజోను, నాన్ ఆక్వా జోన్, 10 ఎకరాల రైతులకే పరిమితం అంటూ ఆక్వా రైతులను విభజించి సబ్సిడీ కరెంటు అందించే రైతులను సగానికి సగం తగ్గించేసాడని విమర్శించారు. ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాగేసుకున్నట్లు అయిందని ఎద్దేవా చేశారు. ఫ్రీ ట్రాన్స్ఫార్మర్ల విధానం ఎత్తివేసి ప్రైవేట్ గా కొనుగోలు విధానం ప్రవేశపెట్టి లక్షల రూపాయల భారం ఆక్వా రైతులు మీద మోపాడు అని చెప్పారు. వీటన్నింటి కంటే మించి గొడ్డలి పార్టీ తన ఐదేళ్ల పదవీకాలంలో ఆరుసార్లు కరెంటు చార్జీలు పెంచారు అన్నారు. రైతులకు ఇంత అన్యాయం చేసిన జగన్ ఓదార్పులు, మద్దతులు, పేరిట పరామర్శల పేరిట ఆక్వా రైతులను కలిసి మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. ఆక్వా రైతుల అష్ట కష్టాలు ఎన్నికల ముందే కళ్లారా చూసిన కూటమి పార్టీలు

### ప్రభుత్వం ఏర్పడ్డాక

ఆక్వా రైతులను ఆదుకుంటామని, రూపాయిన్నరకే కరెంటు ఇస్తామని, జోన్ల విధానం రద్దు చేస్తామని, 10 ఎకరాలు విస్తీర్ణ పరిమితిని తొలగిస్తామని.. ఇచ్చిన హామీనినిలబెట్టుకున్నామని వక్తలు చెప్పారు.. సభాధ్యక్షుడు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రూపాయిన్నరకు కరెంటు ఇవ్వడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై 1100 కోట్లు భారం పడుతుందని.. చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోకపోయినా ఆక్వా రైతులను ఆదుకోవడానికి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని మోదీ కలసి ఆక్వా రైతులకు అండగా నిలబడ్డారని చెప్పారు. ఈ జీవో వల్ల ఎకరాకు 50 వేల పైబడి ఆక్వా రైతులకు ఆదావుతుందని రామానాయుడు చెప్పారు.

### ముఖ్యఅతిథి.. వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి అచ్చన్నాయుడు మాట్లాడుతూ ఆక్వా ఉత్పత్తుల వ్యయం

ఈక్వెడార్ లాంటి ప్రపంచ దేశాలతో పోల్చి చెప్పారు. అక్కడ కిలో ఉత్పత్తికి 190 రూపాయలు అయితే మన దగ్గర 270.. 280 వరకు అవుతుందన్నారు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం విడుదల చేసిన జీవో తో కూటమి ప్రభుత్వం ఇంచుమించు అన్ని హామీలు నిలబెట్టుకున్నట్లు అయిందన్నారు. ఆక్వా యూనివర్సిటీకి 27 కోట్లు మంజూరు చేసినట్లు అచ్చన్నాయుడు చెప్పారు. ఆక్వా రంగంతో పాటు జగన్ అన్ని రంగాలకు చేసిన అన్యాయాలను, అరాచకాలను మంత్రి అచ్చంనాయుడు ఎండగట్టారు. ఆక్వా రంగానికి సంబంధించి ఫీడ్ తయారీ పరిశ్రమలకు నిస్సిగ్గుగా కుల రంగు పూయడానికి ప్రయత్నించాడని ఆయన విమర్శించారు.

# మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

(మొదటి పేజీ తరువాయి)

చేయడంలో ప్రభుత్వానికి ఇవి సహాయపడతాయి. 01 జనవరి 2026ను అర్హత తేదీగా పరిగణించి, తాజా అసెంబ్లీ ఓటర్ల జాబితాలను ఉపయోగించి ఈ జాబితాలను తయారు చేస్తారు.తమ తమ కార్పొరేషన్లకు వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను తయారు చేసి, ప్రచురించే అధికారం మున్సిపల్ కమిషనర్లకు ఉంది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) విషయంలో, సంబంధిత జోనల్ కమిషనర్లు తమ తమ జోన్లకు జాబితాలను తయారు చేసే అధికారం కలిగి ఉన్నారు.



# ఈ నెలాఖరులో వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌కి కృష్ణా జలాలు

(మొదటి పేజీ తరువాయి)

నిజం చేశారన్నారు. ఈ నెల ఆఖరులో వెలుగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులతోపాటు నిర్వాసితుల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నదని చెప్పారు. అందులో భాగంగా తొలి విడత రూ.318 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఇక మిగిలిన 4,761 కుటుంబాలకు ఇవ్వాల్సిన రూ.600 కోట్లలో త్వరలోనే రూ.300 కోట్లు జమ చేస్తామన్నారు. చివరి విడత రూ.300 కోట్లు త్వరలో చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వెలుగొండ నిర్వాసిత గ్రామాల్లో నిర్వాసితులను త్వరితగతిన ఖాళీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు.

# మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన ఐఏఎస్ అధికారి రేవు ముత్యాలరాజు

## పురాతత్వ శాఖ మరియు మ్యూజియం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సచివాలయంలో మంత్రిని కలిసిన రేవు ముత్యాలరాజు

**అమరావతి,ఆగస్టు,12,(మనం ప్రతినిధి):** రాష్ట్ర పురాతత్వ శాఖ మరియు మ్యూజియమ్స్ కమిషనర్గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీనియర్ ఐఏఎస్ అధికారి రేవు ముత్యాలరాజు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన ముత్యాలరాజుకు మంత్రి కందుల దుర్గేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాష్ట్రంలో చారిత్రక, పురావస్తు ఆధారాలు, మ్యూజియంల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ముత్యాలరాజుతో మంత్రి దుర్గేష్ చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ప్రాచీన పురావస్తు సంపదను, చారిత్రక కట్టడాలను, శాసనాలను భవిష్యత్ తరాల కోసం భద్రపరిచి, పరిరక్షించాల్సిన బాధ్యత తమపై



ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మ్యూజియంలను ఆధునీకరించి, పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మన సంస్కృతి, చరిత్ర ప్రసిద్ధిని చాటిచెప్పే పురాతన కళాఖండాలను సంరక్షించడంలో ఆర్కియాలజీ శాఖ మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని తెలిపారు. మంత్రి దుర్గేష్ సూచనలపై కమిషనర్ రేవు ముత్యాలరాజు స్పందిస్తూ... రాష్ట్రంలోని పురావస్తు సంపద పరిరక్షణకు, మ్యూజియంల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగుతామని మంత్రి దుర్గేష్ కి వివరించారు.

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా మరో అడుగు

**గుంటూరు,ఆగస్టు,12,(మనం ప్రతినిధి):** ఏ తల్లీ ప్రసవానికి ముందు, ప్రసవం తర్వాత ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే సదుద్దేశంతో ప్రభుత్వం అధునాతన 'తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్' వాహనాలను ప్రవేశపెట్టిందని గుంటూరు జిల్లా ఇన్చార్జ్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.బుధవారం గుంటూరు నగరంలోని జిజిహెచ్ ప్రాంగణంలో గల కానూరి జింఖానా శిశు మరియు స్త్రీ ఆరోగ్య కేంద్రం వద్ద స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మరియు వైద్య బృందంతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ ప్రతిష్టాత్మక తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్ వాహనాలను జెండా ఊపి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయంగా బాలింతను, నవజాత శిశువును వాహనం ఎక్కించి వారితో ఆత్మీయంగా మాట్లాడి ఇంటికి సాగనంపారు.

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..

నేషనల్ హెల్త్ మిషన్ మరియు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ సర్వీసులను పునరుద్ధరించామని.. ప్రసవానంతరం బాలింతలను సురక్షితంగా ఇంటికి చేర్చడంతో పాటు, ప్రసవానికి ముందు చెకప్లు, హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులు, మరియు తీవ్ర రక్తహీనతతో ఐరన్/సుక్రోజ్ ఇంజెక్షన్లు అవసరమైన గర్భిణులను ఆస్పత్రికి తీసుకురావడానికి ఈ వాహనాలు ఉపయోగపడతాయని వివరించారు. ఇవి పూర్తిగా బ్రాండ్ న్యూ ఏసీ వాహనాలని, ప్రయాణికుల భద్రత కోసం 6 ఎయిర్ బ్యాగ్లు, జీపీఎస్ ట్రాకింగ్, అత్యవసర సమయాల్లో సహాయం కోసం ఖైఖై బటన్, 102 కాల్ సెంటర్ సదుపాయాలతో రూపొందించబడ్డాయని తెలిపారు. గర్భిణులు మరియు బాలింతలు 102 సంఖ్యకు కాల్ చేసి ఉచితంగా ఈ సేవలను పొందవచ్చని పేర్కొన్నారు.. ఏఎన్ఎం లు, పిహెచ్ఎసి సిబ్బంది సమన్వయంతో గర్భిణులను ఆసుపత్రికి తీసుకువచ్చి, క్షేమంగా తిరిగి ఇంటికి చేరుస్తారని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా నిన్న ప్రారంభమైన ఈ వినూత్న కార్యక్రమంలో భాగంగా నేడు గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, గుంటూరు జిల్లాకు 18 వాహనాలను కేటాయించి అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించడం మరియు మాతా, శిశు మరణాల రేటును గణనీయంగా తగ్గించడమే 'ఆరోగ్యాంధ్రప్రదేశ్' సాధనలో ప్రభుత్వ మూల ఉద్దేశమని అన్నారు..కార్యక్రమం అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన 'ఆరోగ్యకరదీపిక' పోస్టర్ను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. స్థానిక వైద్య సమస్యలపై పత్రికా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. స్థానికంగా ఏదైనా సమస్య ఉంటే తక్షణమే పరిష్కరిస్తామని, వైద్యులు రోగులతో ఆప్యాయంగా మెలగాలని చెబుతూ సంజీవని ప్రజా ఆరోగ్య కార్యక్రమం ద్వారా ప్రజలకు అన్ని రకాల వైద్య సదుపాయాలు అందిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపర్ఇంటెండెంట్ డా. దుర్గాప్రసాద్, డిఎంహెచ్ఓ కే. విజయలక్ష్మి, డిసిహెచ్ఎస్ డా. రంగారావు, గైనకాలజిస్ట్ డా. అరుణ, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మరియు ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవారి సేవ 'ట్రైన్ ది ట్రైనర్స్' రెండో విడత శిక్షణ 43 రోజుల్లో పూర్తి

- 10 బ్యాచ్లలో 1,888 మంది గ్రూప్ సూపర్వైజర్లకు శిక్షణ

**తిరుపతి ఆగస్టు 12 మనం న్యూస్:** శ్రీవారి సేవను మరింత బలోపేతం చేసి భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రణాళిక విభాగం సహకారంతో టీటీడీ ప్రజా సంబంధాల శాఖ 43 రోజుల పాటు నిర్వహించిన శ్రీవారి సేవ ట్రైన్ ది ట్రైనర్స్ రెండో విడత శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది.



2026 జూలై 1వ తేదీన ప్రారంభమైన ఈ రెండో విడత శిక్షణలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఉత్తర భారత రాష్ట్రాలకు చెందిన 1888 మంది శ్రీవారి సేవ గ్రూప్ సూపర్వైజర్లు పాల్గొన్నారు. మొదటి బ్యాచ్ తో కలిపి ఇప్పటి వరకు దాదాపు 3000 వేల మంది గ్రూప్ సూపర్వైజర్లు శిక్షణ పొందారు.

**సేవా నాణ్యత పెంపొందించడమే లక్ష్యం**

శ్రీవారి సేవకుల్లో సేవా నైపుణ్యాలు, సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. శిక్షణ పొందిన ట్రైనర్లు తమ తమ మండలాలు, జిల్లాల్లో ఆన్లైన్ ద్వారా శ్రీవారి సేవకు నమోదు చేసుకున్న సేవకులకు తిరుమలకు వచ్చే ముందే శిక్షణ అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

దీంతో సేవకుల్లో సేవా నాణ్యత, అంకితభావం, బాధ్యతాయుత ప్రవర్తన మరింత పెరిగి, తిరుమలకు విచ్చేసే భక్తులకు సమర్థవంతమైన, క్రమశిక్షణతో కూడిన, భక్తి భావపూర్వక సేవలు అందించేందుకు దోహదపడుతుంది.

**సమగ్ర శిక్షణ**

వేద పాఠశాల అధ్యాపకులు, టీటీడీలోని వివిధ విభాగాల నిపుణులు, ఉపన్యాసకులు శ్రీవారి వైభవం, తిరుమల మహత్యం, పురాణ ప్రాశస్త్యం, పూజలు, కైంకర్యాల విశిష్టత, శ్రీవారి సేవ ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

**సేవా కేంద్రాల్లో క్షేత్రస్థాయి శిక్షణ**

శిక్షణలో భాగంగా లడ్డూ కౌంటర్లు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, కళ్యాణకట్ట, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, రిసెప్షన్ తదితర సేవా కేంద్రాలను శిక్షణార్థులు సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో భక్తులకు అందుతున్న సేవలు, సేవకుల బాధ్యతలు, వాస్తవ పరిస్థితుల్లో ఎదురయ్యే సమస్యలు, వాటిని సమర్థవంతంగా పరిష్కరించే విధానాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు.

**శిక్షణలో ప్రత్యేకతలు**

ప్రతి బ్యాచ్లో సుమారు 200 మంది సేవకులకు శిక్షణ అందించడంతో పాటు ప్రతి ఒక్కరికీ ట్రైనింగ్ కిట్, గ్రూప్ సూపర్వైజర్ ట్రైనింగ్ మాన్యువల్ అందించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రచురించిన గోవింద నామాలు, భగవద్గీత, శ్రీనివాస గాథ, విష్ణు సహస్రనామం, లక్ష్మీ అష్టోత్తరం, లలితా సహస్రనామం తదితర ఆధ్యాత్మిక గ్రంథాలను కూడా అందించారు.

**ప్రిన్సిపల్ సూపర్వైజర్లుగా విశ్రాంత గెజిటెడ్ ఆఫీసర్ల సేవలు**

గ్రూప్ సూపర్వైజర్ల పని తీరును పర్యవేక్షించేందుకు ఆగస్టు 1వ తేది నుండి ఐదుగురు విశ్రాంత గెజిటెడ్ అధికారులను ప్రిన్సిపల్ సూపర్వైజర్లుగా నియమించడం జరిగింది. వీరు గ్రూప్ సూపర్వైజర్ల సేవలను అనునిత్యం పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయిలో భక్తులకు మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటారు.

మొదటి విడతలో శిక్షణ పొందిన కొంతమంది సేవకులకు రెండో విడతలో శిక్షణ ఇవ్వడంలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా వారి అనుభవాలను ఇతర సేవకులతో పంచుకునే అవకాశం కల్పించారు.

**మాస్టర్ ట్రైనర్ల పర్యవేక్షణ**

భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎన్సీసీటీ మాజీ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రముఖ హెచ్ఆర్ కన్సల్టెంట్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్.టి. శ్రీనివాస్, టీటీడీ సీపీఆర్వో డాక్టర్ టి.రవి, పీఆర్వో కుమారి నీలిమ, శ్రీవారి సేవా విభాగం సమన్వయకర్తలతో కలిసి ఈ శిక్షణా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

తమిళనాడుకు చెందిన సీనియర్ సేవక్ శ్రీ శరత్ తమిళ భాషా ప్రాంతాల శిక్షణ కార్యక్రమ రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు.

**తొలి విడతలో 1011 మందికి శిక్షణ**

శ్రీవారి సేవ ట్రైన్ ది ట్రైనర్స్ తొలి విడత శిక్షణ గత ఏడాది డిసెంబర్లో ప్రారంభమై 2026 ఫిబ్రవరి 7న ముగిసింది. మొత్తం 10 బ్యాచ్లలో సుమారు 1011 మంది గ్రూప్ సూపర్వైజర్లు శిక్షణ పొందారు. తొలి ఏడు బ్యాచ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సేవకులు, చివరి మూడు బ్యాచ్లలో తమిళనాడు, కర్ణాటకతో పాటు హిందీ మాట్లాడే రాష్ట్రాలకు చెందిన సేవకులు పాల్గొన్నారు.

మొదటి విడతలో వచ్చిన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని రెండో విడతలో కనీస విద్యార్హతగా డిగ్రీని నిర్దేశించడంతో పాటు ఆన్లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులు స్వీకరించారు. రెండో విడతలో 1,888 మంది గ్రూప్ సూపర్వైజర్లకు శిక్షణ అందించడంతో శ్రీవారి సేవను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన శిక్షణ పొందిన గ్రూప్ సూపర్వైజర్లు టీటీడీకి అందుబాటులోకి వచ్చారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు, రామకృష్ణ మఠం స్వామీజీ, సత్య సాయి నేషనల్ కోఆర్డినేటర్ టీటీడీ లోని వివిధ విభాగాల అధిపతులు, ఇతర సిబ్బంది ట్రైనర్లకు టీటీడీకి సంబంధించిన పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది.

# ఆధ్యాత్మిక సాధనతో యువత సర్వతోముఖాభివృద్ధి

- శ్రీశ్రీశ్రీ రమ్యానంద భారతి స్వామిని
- స్విమ్స్లో ఘనంగా 'అంతర్జాతీయ యువజన దినోత్సవం'




**తిరుపతి ఆగస్టు 12 మనం న్యూస్:** నేటి యువత ఆధ్యాత్మిక మార్గంలో పయనించడం ద్వారా మానసికంగా, మేధోపరంగా ఉన్నతి సాధించగలుగుతారని శక్తి పీఠం మాతాజీ శ్రీశ్రీశ్రీ రమ్యానంద భారతి స్వామిని ఉద్ఘాటించారు. శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లోని శ్రీ పద్మావతి ఆడిటోరియంలో బుధవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించినట్లు డ్కా మెడికల్ సూపరింటెండెంట్ డ్కా రామ్ తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ రమ్యానంద భారతి స్వామిని అనుగ్రహ భాషణం చేస్తూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే మంత్రం, ధ్యానం, ఆలయ సందర్శన అలవర్చుకోవాలన్నారు. మంత్ర పఠనం ద్వారా మనస్సు శుద్ధి, ధ్యానం ద్వారా ఏకాగ్రత, ఆలయసందర్శన ద్వారా దివ్యశక్తి చేకూరుతాయని వివరించారు. మంచి ఆలోచనల ద్వారా ఆరోగ్యం, చెడు ఆలోచనల ద్వారా అశాంతి కలుగుతుందన్నారు. ఈ రోజుల్లో సాంకేతికత పెరిగింది కానీ మానసిక ప్రశాంతత కరువైందని, దీనికి కారణం ధర్మాన్ని, సంస్కృతిని మర్చిపోవడమేనని చెప్పారు. భగవంతునిపై పరిపూర్ణమైన నమ్మకం ఉంచితే, జీవితంలో వచ్చే ఎలాంటి కష్టాలనైనా అధిగమించే దివ్యమైన జ్ఞానం మనకు లభిస్తుందన్నారు.

స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ మాట్లాడుతూ...మంత్రపఠనంలో సైన్స్ దాగివుందని, సరైన మార్గంలో గురువుల పర్యవేక్షణలో సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఇది అనుభవ పూర్వకంగా నిరూపితమైనదని తెలియజేశారు. పరమ పూజ్యశ్రీ రమ్యానంద భారతి స్వామిని ఆధ్యాత్మిక సందేశాలు, సనాతన ధర్మ సూత్రాల ఆధారంగా ఒక చక్కని ఉపన్యాసం ఇచ్చారని విద్యార్థులు మాతాజి గారు చెప్పిన విషయాలను తప్పకుండా పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా మాతాజి ని విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోస్టర్ ప్రెజెంటేషన్, వ్యాస రచన, చర్చావేదిక, క్విజ్ పోటీల్లో విజేతలకు పూజ్యశ్రీ రమ్యానంద భారతి స్వామిని సర్టిఫికెట్స్, బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డీన్ డా. అలోక్ సచన్, రిజిస్ట్రార్ డా. అపర్ణ ఆర్ బిట్లా, మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్, యస్. పి. యం. సి. డబ్ల్యూ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. ఉమామహేశ్వర రావు, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. సుధారాణి, ఫిజియో థెరపి కాలేజ్ ప్రిన్సిపాల్ డా. మాధవి, అల్లైడ్ హెల్త్ సైన్సెస్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. మధుబాబు, కార్డియాలజీ విభాగాధిపతి వనజాక్షమ్మ, బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగాధిపతి డా.ఉమామహేశ్వరి, బయోటెక్నాలజీ విభాగాధిపతి శర్మ, యస్. పి. యం. సి. డబ్ల్యూ వైస్ ప్రిన్సిపాల్ డా. శర్వాణి, మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డ్కా శ్రీరమ్య, డిప్యూటీ రిజిస్ట్రార్ డా. ఎర్రంరెడ్డి వివిధ విభాగాధిపతులు, వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామ సచివాలయాల్లో పనితీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- ఆధార్ కేంద్రాలలో మౌలిక వసతుల ఎంపీడీవోలు పర్యవేక్షించాలి
- జిల్లా స్థాయిలో నిర్వహించే జాబ్ మేళ పై విస్తృతంగా ఎంపీడీవోలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, ఆగస్టు 12 మనం న్యూస్ :** ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.

బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత ఎంపీడీవోలు, సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా మండలాలలో ఏఈలు ఎంపీడీవోలు క్లీనింగ్ నీటి పైపుల మరమ్మత్తు పనులు పరిశీలించాలని, నీటిని ఎక్కడ కూడా వృధా కాకుండా అరికట్టాలని ఆదేశించారు. నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనాలు వేసుకుంటూ తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. 15 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని సంబంధిత ఎంపీడీవోలను ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతము వర్షాలు సమృద్ధిగా కురవడం లేదని ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బంగారుపాళ్యం, పూతలపట్టు, పెద్దపంజాణి, విజయపురం, తదితర మండలాలలో 53 నివాసత ప్రాంతాల తాగునీటి ఎద్దడి ఉన్నదని నివేదికలు పేర్కొన్నారు. అవసరమైన నిధులు మంజూరు చేయడం జరుగుతుందని, బోర్ వెల్స్, పైప్ లైన్లు, పంపు నిర్మాణం పనులు పరిశీలించి మరమ్మత్తు పనులు యుద్ధ ప్రాతిపదిగిన చేపట్టాలని ఆదేశించారు. గత 15 రోజుల నుంచి జిల్లాలో వివిధ గ్రామ సచివాల ఆధ్వర్యంలో నిర్వహించే ఆదర్ కేంద్రాలు పనిచేయడం లేదు నివేదికలు అందుతున్నాయని తెలిపారు సంబంధిత ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు చిన్న చిన్న మరమ్మత్తులు ఉంటే వెంటనే మరమత్తు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు పెనుమూరు, ఎస్ఆర్ పురం, చిత్తూర్ అర్బన్, కార్వేటినగరం, గుడిపాల మండలాలలో ఆధార్ సెంటర్లు వారం రోజులు లోపు యధావిధిగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు, ఈనెల 13, 14, మరియు17,21 తేదీలలో 22,000 మందికి ఆధార్ కేంద్రాలలో బయోమెట్రిక్ అప్డేషన్ పై ఉచితంగా నమోదు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పై విషయాలపై ప్రజలకు తెలియజేయవలసిందిగా బాధ్యత సంబంధిత ఎంపీడీవోలు పై ఉన్నదని ఆదేశించారు ఈనెల 25 వ తేదీన జ్యోతిరావు పూలే భవనం నందు జిల్లా స్థాయిలో సత్యవేడు,ఖిడో ఆధ్వర్యంలో కంపెనీలు యువతకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని దీనిపై విస్తృతంగా మండల స్థాయిలో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారుఈ కార్యక్రమంలో సంబంధిత ఏ ఈ లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు. అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేసిన కలెక్టర్

**చిట్వేలు, ఆగస్టు 12మనం న్యూస్:** చిట్వేలు తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలు, దరఖాస్తుల పరిష్కారం, భూ సంబంధిత అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం మండలంలో జరుగుతున్న రీ-సర్వే పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, పెండింగ్లో ఉన్న అంశాలు, భూ రికార్డుల పరిశీలన తదితర వివరాలను తెలుసుకున్నారు. రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, భూ రికార్డులను నిబంధనల మేరకు పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలని సూచించారు.

ఎలాంటి తప్పులు లేకుండా, రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్పుస్తకాలను రైతులకు అందించాలన్నదే గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పట్టాదారు పాస్పుస్తకాల జారీలో పూర్తి పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చిట్వేల్ తాసిల్దార్ నరసింహారావు పాల్గొన్నారు.




అనంతరం పెనగలూరు తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులు, రెవెన్యూ సేవల అమలు తీరును పరిశీలించారు. అనంతరం మండలంలో జరుగుతున్న ఇరిగేషన్ పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి, ప్రస్తుత పరిస్థితి, పెండింగ్ అంశాలను అడిగి తెలుసుకుని, పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలకు, రైతులకు సంబంధించిన భూ, రెవెన్యూ, సాగునీటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సూచించారు.

# బిజెపి మాధవ్ను కలిసిన శ్రీనివాసులు



**తిరుపతి ఆగస్టు 12 మనం న్యూస్:** బిజెపి అంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీన్ మాధవ్ ను సౌత్ ఇండియా కురవ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి దుశాలువా కప్పి కురవ కులస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరామని ఒక ప్రకటనలో తెలిపారు . బుధవారం విజయవాడలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పీవీన్ మాధవ్ ని కలిసి రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ నామినేటెడ్ పదవులు, ఎమ్మెల్సీ స్థానాలు కురుబ లకు కేటాయించాలని, అలాగే స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు,సర్పంచులు, కౌన్సిలర్ల స్థానాలలో కురుబ,కురుమ, కురుబ,కులస్తులకు అధిక సంఖ్యలో సీట్లు కేటాయించాలని కోరానని సౌత్ ఇండియా కురవ సంఘం అధ్యక్షులు మరియు సౌత్ ఇండియా ఓబిసి అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రాయలసీమ ప్రాంతంలోనూ,గుంటూరు కృష్ణ,నెల్లూరు,ప్రాంతాలలో కూడా అధిక సంఖ్యలో కురుబలు ఉన్నారని, జనాభా ప్రాతిపదికన మాకు రావలసిన సీట్లను కేటాయించాలని అన్నారని తెలిపారు.

# బొప్పాయి రైతులకు స్థిరమైన ధరలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు

**రైల్వే కోడూరు, ఆగస్టు 12 మనం న్యూస్:** తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఉప్పరపల్లి పంచాయతీలో బొప్పాయి పంట హార్వెస్టింగ్ సీజన్, రైతులకు లభిస్తున్న ధరలు, మార్కెట్ పరిస్థితులను పరిశీలించి రైతులతో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గంలో బొప్పాయి సాగు విస్తారంగా జరుగుతోందని, ప్రస్తుతం హార్వెస్టింగ్ సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రైతులకు లభిస్తున్న ధరలు, మార్కెటింగ్ విధానం, ఉత్పత్తి వ్యయాలు తదితర అంశాలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు.రైల్వే కోడూరు ప్రాంతంలో గత సుమారు 20 సంవత్సరాలుగా అమలులో ఉన్న మార్కెటింగ్ విధానంలో ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు స్థానిక మధ్యవర్తుల ద్వారా రైతులతో ముందస్తు ఒప్పందాలు చేసుకుని విత్తనాలు సరఫరా చేస్తున్నారని తెలిపారు. అనంతరం పంట కోత, హమాలీల ద్వారా ప్యాకింగ్, లోడింగ్, వాహనాల ఏర్పాటు, రవాణా తదితర బాధ్యతలను కూడా వారే నిర్వహిస్తున్నారని వివరించారు.ప్రస్తుతం కిలోకు రూ.17-18 వరకు ధర



ప్రస్తుతం బొప్పాయి ధర కిలోకు సుమారు రూ.17గా ఉందని, గత నెల రోజులుగా మార్కెట్ ధరలు సుమారు రూ.16 నుంచి రూ.20 మధ్య హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. రైతులు నష్టపోకుండా చూడాలనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం వ్యాపారులు, మధ్యవర్తులతో సమావేశాలు నిర్వహించి స్పష్టమైన సూచనలు చేయడంతో ఈసారి బొప్పాయి ధరలు కొంత స్థిరంగా ఉన్నాయని తెలిపారు.

గత ఏడాది ఒక దశలో బొప్పాయి ధర కిలోకు రూ.5-6 వరకు పడిపోయిన పరిస్థితి ఏర్పడిందని, ఆ సమయంలో ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని రైతులకు కనీస ధరగా కిలోకు రూ.9 అందేలా చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులు మెరుగ్గా ఉండటంతో రైతులకు కిలోకు సుమారు రూ.17-18 వరకు ధర లభిస్తోందని తెలిపారు.రైతులతో మాట్లాడిన సందర్భంగా వచ్చే పంటకు విత్తనాల ధరలు అధికంగా ఉండటం వల్ల సాగు వ్యయం పెరుగుతోందని రైతులు తమ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఒక్క మొక్కకు విత్తన వ్యయం సుమారు రూ.25 నుంచి రూ.35 వరకు అవుతోందని రైతులు తెలిపారు.

# భర్త దారుణ హత్య

- భార్య, ప్రియుడు అరెస్ట్..
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

**మదనపల్లె ఆగస్టు 12 మనం న్యూస్:** వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో భర్తను భార్య తన ప్రియుడితో కలిసి దారుణంగా హత్య చేసిన ఘటన పీలేరు పట్టణంలో ఈనెల 7న జరిగింది. హత్య అనంతరం మృతదేహాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసుల సాంకేతిక ఆధారాలతో నిందితుల కుట్ర బట్టబయలైంది. ఈ కేసులో భార్య మంగినేని ఉమాదేవి (41), ఆమెతో వివాహేతర సంబంధం ఉన్న, చంద్రగిరి మండలం పాకాల కు చెందిన, చారాల సుబ్రహ్మణ్యం (32)ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మదనపల్లెలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

**పథకం ప్రకారం నిద్రమాత్రలు కలిపి..**


పీలేరు పట్టణంలోని డిష్ కాలనీకి చెందిన మంగినేని ఉమాదేవికి తిరుపతి జిల్లా చంద్రగిరి మండలానికి చెందిన చారాల సుబ్రహ్మణ్యంతో వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తమ సంబంధానికి ఉమాదేవి భర్త మంగినేని వెంకట సుబ్రహ్మణ్యం(45) అడ్డుగా ఉన్నాడని భావించిన ఇద్దరు అతడిని హత్య చేయాలని పథకం పన్నారు. నేరుగా దాడి చేస్తే ప్రతిఘటించే అవకాశం ఉండటంతో ముందుగా నిద్రమాత్రలు ఇచ్చి హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఆగస్టు 7న రాత్రి 8.30 గంటలకు ప్రియుడు చారాల సుబ్రహ్మణ్యం తెచ్చిన నిద్రమాత్రలను ఉమాదేవి ఇడ్లీ, సాంబారు, చట్నీలో కలిపి భర్తకు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి 11.30 గంటల సమయంలో అతడు గాఢనిద్రలోకి వెళ్లిన తర్వాత ఉమాదేవి, ప్రియుడు సుబ్రహ్మణ్యాన్ని ఇంటికి పిలిపించింది. ఇద్దరు కలిసి ఇనుప రాడ్, గుండ్రాయితో భర్త తలపై దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు.



# వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెనేర్కు ప్రాధాన్యత ఇవ్వాలి

- అర్హత ఉన్న సభ్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలి
- చిత్తూరు డిఆర్డిఏ పి డి శ్రీదేవి

**చిత్తూరుఆగస్టు12మనం న్యూస్ :** జిల్లాలో వన్ ఫ్యామిలీ.. వన్ ఎంట్రప్రనర్ కు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి , అర్హత ఉన్న ప్రతి ఒక్క సంఘ సభ్యురాలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని చిత్తూర్ డి ఆర్ డి ఏ పి డి శ్రీదేవి తెలిపారు. చిత్తూరు డిఆర్డిఏ సమావేశ మందిరంలో జిల్లాలోని ఏపీఎంలు సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ జిల్లాలో




నెలరోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రతి మండలానికి వెయ్యి మంది సంఘ సభ్యులను గుర్తించి, వారిని మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. స్థానికంగా ఉన్న వనరులు తదితరు అంశాలను పరిణయం తీసుకుని సంఘ సభ్యులను చిన్న మధ్యతరహా పరిశ్రమల స్థాపన దిశగా చైతన్య పరచాలన్నారు. అందుకోసం నాబార్డ్ వ్యాపార పరంగా అవగాహన అంశాలపై శిక్షణ కార్యక్రమాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా కరువు చాయలు నెలకొంటున్న పరిస్థితుల్లో సంఘాల్లోని సభ్యులను కిచెన్ గార్డులు, చిరుధాన్యాల సాగు అంశాలపై అవగాహన కల్పించాలన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ




**చిత్తూరు ఆగస్టు 12 మనం న్యూస్:** డిజిటల్ యుగంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా ఆన్లైన్ లావాదేవీలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భారతి, క్రైమ్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా బాలల సంరక్షణ అధికారి డా. సుబ్రహ్మణ్యం, పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భారతి మాట్లాడుతూ, విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్లు, లింక్లు సోషల్ మీడియా సందేశాలను నమ్మవద్దని తెలిపారు.

క్రైమ్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఆన్లైన్ మోసాలకు గురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు, పోలీసు అధికారులు, ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ గిరి, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పునరుద్ధరిస్తాను

మా పెరటిలో కుల
విషవృక్షం ఏపుగా ఎదిగింది.

చుట్టూ ఉన్న ప్రేమవృక్షాల్ని
పెకిలించివేస్తోంది.

అది గాలి వీచినప్పుడల్లా
నాకు ఊపిరాడదు!

అహం కొమ్మలై విస్తరిస్తూ
దుఃఖాన్ని మొలిపిస్తోంది.

హృదయానికి గాయం చేస్తోంది!
నా కోమలత్వాన్ని మాయం చేస్తోంది.

తలవంచితే ఆ గాలి
బంధాలను తెంపేస్తోంది.

నన్ను శూన్యానికి నెట్టేస్తోంది!
ఎదురించి నిలబడతాను.

దారితప్పిన మానవత్వాన్ని
పునరుద్ధరిస్తాను!

పోరాటం ఏదైనా ముగింప
దుఃఖం కాకూడదు.

**- పద్మజా రామకృష్ణ.పి**
9491830278

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

**ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్**

# బయో ఫ్యూయెల్‌కు కరువైన ప్రోత్సాహం

మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది.

మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు. అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్న మైంది.

పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి.

శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళి మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది.

కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహోలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్లో కలిపి డిజిల్ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క



కార్బొరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌నువాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ఓఇవద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడు తుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువు లను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడు తుంది.

భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది.

బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం:పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి.

గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు.

నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషి చేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందు బాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది.

స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేసింది.

స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కువగా ఆధారపడటం, విద్యుత్ సేవలను పెంచడం, తాజాగా ఆవిర్భవిస్తున్న హైడ్రోజన్ వంటి ఇంధనాలవైపు మరలడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది.

**- రామకిష్టయ్య సంగన భట్ల**
9440595494

# ముదిమి వయస్సులో జీవన విధానం మార్చుకోవాలి



ప్రతి మనిషి జీవితంలో వృద్ధాప్యం అనేది తప్పనిసరిగా వచ్చే దశ. వృద్ధాప్యాన్ని ఎలా స్వీకరించాలి, ఎలా ఆరోగ్యంగా మరియు ప్రశాంతంగా జీవించాలి అనేది మాత్రం మీ చేతుల్లోనే ఉంటుంది. యుక్త వయస్సులో జీవితం తపనతో సాగుతుంది. చదువు, ఉద్యోగం, వ్యాపారం, కుటుంబం, ఆస్తి, పిల్లల భవిష్యత్తు, ఆర్థిక స్థిరత్వం ఇలా ఎన్నో లక్ష్యాల కోసం మనిషి నిరంతరం పరుగులు తీస్తుంటాడు. శరీరంలో శక్తి ఎక్కువగా ఉంటుంది. సమయం అంతా మీ చేతిలోనే ఉందనే భావన ఉంటుంది. కానీ మధ్యవయస్సుకు చేరుకునే సరికి జీవితాన్ని మరో కోణంలో చూడటం ప్రారంభమవుతుంది. అప్పటివరకు సంపాదన, బాధ్యతలు, భవిష్యత్తు గురించి ఆలోచించిన వ్యక్తి, ఇక ఆరోగ్యం, ప్రశాంతత, కుటుంబంతో గడిపే సమయం, తనకు తాను కేటాయించే సమయం గురించి కూడా ఆలోచించాలి. వృద్ధాప్యం అంటే బలహీనత కాదు. వయస్సు పెరిగినంత మాత్రాన మనిషి విలువ తగ్గిపోదు. అనుభవం పెరుగుతుంది. జీవితాన్ని చూసిన విధానం మారుతుంది. ఎన్నో పరిస్థితులను ఎదుర్కొన్న అను భవం వల్ల సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం పెరుగు తుంది. యువతకు శక్తి ఉంటే, వృద్ధులకు అనుభవం ఉంటుంది. వృద్ధాప్యాన్ని ఒక భారంగా కాకుండా జీవితంలో మరో అందమైన దశగా చూడాలి. వృద్ధాప్యం వచ్చిన తర్వాత జీవనశైలిని మార్చు కోవడం కంటే, మధ్యవయస్సులోనే కొన్ని అలవాట్లను ఏర్పరచు కోవడం మంచిది. రోజువారీ జీవితంలో క్రమశిక్షణ, సమయానికి నిద్ర, సమతుల్యమైన ఆహారం, తగినంత శారీరక కదలిక, ఒత్తిడిని తగ్గించుకోవడం, వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి అలవాట్లు ముందుగానే ఏర్పడితే వృద్ధాప్యంలో జీవితం కొంత సులభంగా ఉంటుంది. మీ శరీరం మీకు జీవితాంతం తోడుగా ఉండే సాధనం. అందుకే దాన్ని నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వయస్సు పెరిగే



కొద్దీ శరీర అవసరాలు మారుతాయి. ఆహారంలో కూడా సరైన మార్పులు అవసరం. తాజా కూరగాయలు, పండ్లు, పప్పులు, సంపూర్ణ ధాన్యాలు, అవసరమైన ప్రోటీన్, తగినంత నీరు వంటి పోషకమైన ఆహారాన్ని తీసుకోవడం మంచిది. అధిక ఉప్పు, అధిక చక్కెర, అతిగా నూనెతో తయారైన ఆహారం మరియు అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించడం ఉపయోగకరం. అవసరమైతే వైద్యుడు లేదా పోషకాహార నిపుణుడి సలహా తీసుకోవాలి. వృద్ధాప్యంలో ఎక్కువసేపు ఒకే చోట కూర్చోవడం అలవాటుగా మారకూడదు. శరీరానికి తగినంత కదలిక ఉండాలి. వైద్యుల సూచనకు అనుగుణంగా నడక, తేలికపాటి వ్యాయా మం, స్ట్రెచింగ్ లేదా ఇతర అనుకూలమైన శారీరక కార్య కలాపా లను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవచ్చు. శరీరం కదు లుతూ ఉంటే మనసు కూడా చురుకుగా ఉండే అవకాశం ఉంటుంది. వయస్సు పెరిగిన తర్వాత కొత్త వ్యాయామాలను ప్రారంభించకుండా, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా నిపుణుల సలహాతో కొనసాగించడం మంచిది. మానసిక ఆరో గ్యాన్ని కూడా పట్టించుకోవాలి వృద్ధాప్యంలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా చాలా ముఖ్యం. పిల్లలు తమ జీవితాల్లో బిజీగా ఉండవచ్చు. బంధువులతో కలిసే సమయం తగ్గవచ్చు. ఉద్యోగ విరమణ తర్వాత రోజువారీ జీవితంలో ఖాళీ సమయం పెరగవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఒంటరితనం అనిపించకుండా మీకు నచ్చిన పనుల్లో మిమ్మల్ని, మీరు నిమగ్నం చేసుకోవాలి. పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, తోటపని చేయడం, ఆధ్యాత్మిక లేదా సాంస్క ృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం, స్నేహితులతో మాట్లాడటం, సామాజిక సేవ చేయడం వంటి కార్యకలాపాలు జీవితానికి ఉత్సాహాన్ని ఇస్తాయి. మధ్య వయస్సులోనే వృద్ధాప్యంలో వచ్చే పరిస్థితులను అంచనా వేసుకొని ఆర్థిక ప్రణాళిక ఏర్పాటు చేసుకోవడం చాలా అవసరం. అవసరమైన పొదుపు, బీమా, పదవీ విరమణ తర్వాత వచ్చే ఆదాయం, రోజువారీ ఖర్చులు వంటి అంశాలను ప్రణాళిక చేసుకోవాలి. పిల్లలపై పూర్తిగా ఆధారపడకుండా, సాధ్యమైనంత వరకు తమ అవసరాలకు తాము సమకూర్చుకునే విధంగా ఆర్థిక ప్రణాళిక ఉండటం ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది. పిల్లలపై అంచనాలను తగ్గించు కోవాలి. పిల్లలు ఇలా చేయాలి, వాళ్లు ప్రతిరోజూ మనతో ఉండాలి, మన మాట వినాలి అనే అంచనాలు ఎక్కువైతే నిరాశ కూడా ఎక్కువవుతుంది. పిల్లలు తమ జీవితాల్లో, ఉద్యోగాల్లో, కుటుంబ బాధ్యతల్లో బిజీగా ఉంటారు. వారి పరిస్థితిని అర్థం చేసుకుంటూ, ప్రేమను మాత్రం కొనసాగిస్తూ, అవసరానికి మించి ఆధారపడకుండా ఉండటం మంచిది. ప్రేమ ఉండాలి కానీ అధిక అంచనాలు ఉండకూడదు. ఒంటరిగా ఉండటం వేరు, ఒంటరితనం వేరు వృద్ధాప్యంలో కొంత సమయం ఒంటరిగా గడపడం తప్పు కాదు. కానీ ఒంటరితనం మనస్సును కుంగదీయకుండా చూసుకోవాలి. స్నేహితులతో మాట్లాడటం, బంధువులను కలవడం, పరిచయస్తులతో సంబంధాలు కొనసాగించడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మనసుకు ఉత్సాహం వస్తుంది. మనిషి వయస్సు పెరిగినా అతనికి స్నేహం, ఆప్యాయత, గౌరవం అవసరం అలాగే ఉంటుంది. ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదు వయస్సు పెరిగే కొద్దీ శరీరంలో వచ్చే మార్పులను నిర్లక్ష్యం చేయకూడదు. సాధారణ ఆరోగ్య పరీక్షలు, వైద్యుల సూచనలు, అవసరమైన మందులు మరియు ఫాలోఅప్లను క్రమంగా పాటించడం మంచిది. శరీరంలో కొత్తగా కనిపించే లేదా కొనసాగుతున్న సమస్యల గురించి వైద్యుడిని సంప్రదించడం అవసరం. వృద్ధాప్యంలో గత జ్ఞాపకాలు ఎక్కువగా గుర్తుకు వస్తాయి. చేసిన తప్పులు, కోల్పోయిన అవకాశాలు, ఎదురైన అవమానాలు, పాత గొడవలు మనసులో తిరుగుతుంటాయి. గతం నుంచి పాఠాలు తీసుకోవాలి కానీ గతంలోనే జీవించకూడదు. అందుకే మిగిలిన జీవితాన్ని ప్రశాంతంగా, ఆనందంగా, ఇతరులకు ఉపయోగ పడేలా గడపడం ఉత్తమం. ఎవరికైనా ఉపయోగపడేలా జీవిం చాలి వృద్ధాప్యం అంటే విశ్రాంతి మాత్రమే కాదు. మీకు తెలిసిన జ్ఞానాన్ని, అనుభవాన్ని వస్తున్న తరానికి అందించే సమయం కూడా. చిన్నవారికి సలహాలు ఇవ్వడం, వారికి మార్గదర్శకత్వం చేయడం, సామాజిక సేవలో పాల్గొనడం, అవసరమైన వారికి సహాయం చేయడం వంటి పనులు జీవితానికి ఒక అర్థాన్ని ఇస్తాయి. వృద్ధాప్యానికి ముందే సిద్ధం కావాలి వృద్ధాప్యం వచ్చిన తర్వాత ఇలా ఉండాలి అని ఆలోచించడం కంటే, మధ్యవయస్సులోనే ఆ దశకు సిద్ధం కావడం మంచిది. ఆరోగ్యం కోసం క్రమశిక్షణ, ఆర్థిక భద్రత కోసం పొదుపు, మనశ్శాంతి కోసం మంచి సంబంధాలు, చురుకుదనం కోసం మంచి అలవాట్లు, సంతోషం కోసం సంతృప్తి, గౌరవం కోసం మంచి ప్రవర్తన ఇవి వృద్ధాప్యాన్ని సులభతరం చేసే ముఖ్యమైన అంశాలు.వృద్ధాప్యం జీవితానికి ముగింపు కాదు. అది జీవితాన్ని నెమ్మదిగా ఆస్వాదించే మరో దశ. జీవితం ఎంతకాలం అనేది ఎవ్వరి చేతుల్లో ఉండదు. కానీ ఉన్నంతకాలం ఎలా జీవించాలి అనేది మాత్రం మీ చేతుల్లోనే ఉంటుంది. వృద్ధాప్యాన్ని ఎదురు చూడకండి. వృద్ధాప్యానికి ఇప్పటి నుంచే సిద్ధం అవ్వండి, వచ్చిన వృద్ధాప్యాన్నీ ఆనందంగా, ప్రశాంతంగా కొనసాగించండి.

**- వై. సంజీవ కుమార్**
9393613555

## బొడ్రాయమ్మ..!

వానమ్మ యాడబోయనో
చినుకు చుక్క లేకపాయే
ఊరు చినబోయి కూకుంది
వాడలో మనిషి జాడే కరువాయే
వాన కోసం కప్పల పెళ్లి
గంగమ్మకు ముక్కుబడి
తువాలి నడుంలో చిక్కిలించి
సెలకలెంబడి పరుగుడాయే

బొడ్రాయమ్మకు నీళ్ళోసి
చెరువు గట్టుకు టెంకాయ కొట్టి
పొలిమేర తిరిగి రావడమాయే
గూట్లో గువ్వలెగిరిపాయే
పశువుల మేపు కట్టమైపాయే
కాళ్ళిరిగిన సంసారం
ఆడనే కూలబడి ఏడ్పుడాయే

తప్పెట్ల భజనలతో
ఊరూరా తిరుగుడే పనైపాయే
గాలికెగిరిన కంప
గోచీకి తగిలినట్టాయే
మూటముళ్ళె సర్ది ఏగుడాయే
కంట్లో ఎట్టుకోడాన్కి
ఒక్క చుక్కైనా నీరు దొరక్కపాయే
గడ్డపార నాగలి మూలకేగి
ఎక్కెక్కి ఏడ్చుకునే పనైపోయే
కరువొచ్చి కాళ్ళకు అడ్డుపడతాంటే
బువ్వకు దిగులొచ్చి
కుండలోనే పాచిపోవుడాయే
బొడ్రాయమ్మకు నిండా నీళ్ళోసి
పైకి ఎగచూడ్డమే గతైపాయే
గ్రహచారం గోడెక్కి కూయబట్టే
ఆచారం వీధులెంట తిరగబట్టే

**- నరెద్దుల రాజారెడ్డి**
9666016636

# పారిశ్రామిక ప్రగతికి ఏపీ సరికొత్త అడుగులు

**• మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**అమరావతి, ఆగస్టు 12,(మనం ప్రతినిధి) :** 'సిఐఐ పార్ట్నర్షిప్ సమిట్ 2026 'కి ముందుగా చేపడుతున్న పెట్టుబడుల ప్రోత్సాహక కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' (సిఐఐ) భాగస్వామ్యంతో.. ఏపీఈడీబీ (ఆట్టృఆ) సమన్వయంతో చెన్నై, కోయంబత్తూర్లో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ రోడ్షో విజయవంతమైనట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, అంతర్జాతీయ వాణిజ్య సంస్థల ప్రతినిధులు పాల్గొనగా రాష్ట్రంలో విస్తృత పెట్టుబడి అవకాశాలను ప్రభుత్వ బృందం సవివరంగా ప్రదర్శించింది.

ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రగతిశీల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్లో సమృద్ధిగా ఉన్న సహజ వనరులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన మౌలిక వసతులు, వ్యూహాత్మక పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు మరియు పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించారు. అలాగే రాష్ట్రంలో సాగుతున్న సుపరిపాలన , వేగవంతమైన వ్యాపార ప్రక్రియలు , పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు వివరించారు. రాష్ట్రంలో విభిన్న రంగాల్లో ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా పరిశ్రమలు, పెట్టుబడిదారులను ఆహ్వానించిన మంత్రి, పరస్పర ప్రయోజనకర భాగస్వామ్యాల నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని భరోసా ఇచ్చారు. ఇసుజు మోటార్స్, హీరో మోటోకార్ప్, కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్తో తమకున్న సానుకూల అనుభవాలను పంచుకోవడం, రాష్ట్రంలో ఆకర్షణీయమైన పెట్టుబడి వాతావరణానికి నిదర్శనం అని మంత్రి తెలిపారు. మంగళవారం చెన్నైలో జరిగిన సదస్సులో జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, ఇండో-జాపాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ ఎస్. పద్మనాభన్, చెన్నై డైరెక్టర్ జనరల్ స్టీఫెన్ హ్యు, పోస్కో చెన్నై ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ మిస్టర్ జంగ్ ఊంగ్ కాంగ్తో చర్చలు జరపడంతో పాటు సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి మరియు యంఎస్ఈ రంగాలలో ఉన్న అవకాశాలపై చర్చలు సాగినట్టు మంత్రి తెలిపారు.

బుధవారం కోయంబత్తూరులో జరిగిన సదస్సులో గోల్ రిఫైనరీ, దీని ద్వారా ఎంఎస్ఎంఈ రంగానికి లభించే అవకాశాలపై ఎమరాల్ జ్యువెలరీ మేనేజింగ్ డైరెక్టర్ కె. శ్రీనివాసన్ గారితో చర్చించినట్టు మంత్రి తెలిపారు. అలాగే లీప్ గ్రీన్ సిఈఓ దేవానంద్ తో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ గురించి, జియాన్ ఛార్జింగ్ సిఈఓ కార్తికేయన్ పళనిస్వామి, ఎల్.జి. బాలకృష్ణన్ బ్రోస్ డైరెక్టర్ మిస్టర్ రాజీవ్ పార్థసారథి, తిరుప్పూర్ ఎక్స్పోర్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎన్. తిరుక్కమారన్, సీగర్ గ్రూప్ ఎండీ రాధాకృష్ణన్తో చర్చలు విజయవంతమైనట్టు మంత్రి తెలిపారు.

ఈ సదస్సుల్లో పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ ఇండస్ట్రీస్, టూరిజం హాస్పిటాలిటీ, తయారీ రంగం, పారిశ్రామిక క్లస్టర్లు, పోర్టులు, లాజిస్టిక్స్ మరియు ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులలో ఉన్న విస్తృత అవకాశాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున వివరించామని మంత్రి చెప్పారు. ఈ యేడాది నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సిఐఐ పార్ట్నర్షిప్ సమిట్ 2026 కు ఈ చెన్నై-కోయంబత్తూర్ సదస్సుల్లో ఎంతో సానుకూల స్పందన లభించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారుల ఆసక్తిని వాస్తవ పెట్టుబడులుగా మార్చడానికి వేగవంతమైన అనుమతులు, ప్రాజెక్టుల పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణతో పాటు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ సదస్సుల్లో సిఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ జి. సాంబశివరావు, సిఐఐ చెన్నై ఛైర్మన్ ఆర్.వి. చారి, కోయంబత్తూర్ జోన్ సిఐఐ ఛైర్మన్ వి. నౌషాద్, వైస్ ఛైర్మన్ మహాలింగం రామస్వామి, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సహకారం.. కూటమి ప్రభుత్వ కృషి..

### శరవేగంగా అమరావతి రాజధాని నిర్మాణం
### 21.77 కిలోమీటర్ల అంతర్జాతీయ స్థాయి సీడ్ యాక్సెస్ రోడ్డు పూర్తి
### అంతర్జాతీయ గుర్తింపు పొందనున్న అమరావతి
### బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

**అమరావతి,ఆగష్టు,12,(మనం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి , పట్టుదలతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం శరవేగంగా ముందుకు సాగుతోందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. రాజధాని నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అమరావతి అభివృద్ధికి మరింత ఊతమిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాజధాని నిర్మాణంలో అత్యంత కీలకమైన మౌలిక వసతుల్లో భాగంగా 21.77 కిలోమీటర్ల అంతర్జాతీయ స్థాయి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం పూర్తవడం ఒక ముఖ్యమైన మైలురాయిగా ఆయన అభివర్ణించారు. ఆధునిక ప్రమాణాలతో నిర్మించిన ఈ భారీ రహదారి అమరావతి రాజధాని ప్రాంతానికి మెరుగైన రవాణా సౌకర్యాలను అందించడంతో పాటు, భవిష్యత్తో రాజధాని అభివృద్ధికి కీలక రవాణా మార్గంగా నిలవనుందని తెలిపారు. 9 లేన్ల క్యారేజ్వే, అత్యాధునిక రహదారి వసతులు కలిగిన సీడ్ యాక్సెస్ రోడ్డు జాతీయ రహదారితో నేరుగా అనుసంధానం కావడం ద్వారా అమరావతికి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు దేశంలోని ప్రధాన నగరాలతో మెరుగైన రవాణా సంబంధాలు ఏర్పడే అవకాశం ఉందని డాక్టర్ ఏలూరి పేర్కొన్నారు. వేగవంతమైన రవాణా వ్యవస్థ రాజధాని ప్రాంతంలో పెట్టుబడులు, వాణిజ్యం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల విస్తరణకు దోహదపడుతుందని తెలిపారు. అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగానే కాకుండా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా మౌలిక వసతుల అభివృద్ధి వేగం పుంజుకోవడం శుభపరిణామమని ఆయన అన్నారు. మెరుగైన రహదారులు, ప్రభుత్వ భవనాలు, ప్రజాప్రతినిధులు మరియు న్యాయవ్యవస్థకు అవసరమైన వసతులు అందుబాటులోకి రావడం రాజధాని నిర్మాణం క్రమంగా సాకారమవుతున్నదానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇదే క్రమంలో అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గౌరవ న్యాయమూర్తుల కోసం నిర్మించిన క్వార్టర్ల నిర్మాణం పూర్తై నేడు ప్రారంభం కానుండటం మరో కీలక ఘట్టమని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. రాజధాని ప్రాంతంలో ప్రజాప్రతినిధులు, న్యాయవ్యవస్థకు అవసరమైన నివాస వసతులు సిద్ధం కావడం ద్వారా పరిపాలనా కార్యకలాపాలకు మరింత సౌలభ్యం కలుగుతుందని అన్నారు. గతంలో ఎన్నో సంవత్సరాలుగా అమరావతి నిర్మాణంపై నెలకొన్న అనిశ్చితికి తెరదించుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం రాజధాని అభివృద్ధిని వేగవంతం చేస్తోందని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి, సమన్వయంతో అమరావతి మహానగర నిర్మాణం వేగంగా రూపుదిద్దుకుంటోందని డాక్టర్ ఏలూరి పేర్కొన్నారు. రాజధాని నిర్మాణం వేగం పుంజుకోవడం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ముఖ్యంగా అమరావతి ప్రాంత ప్రజలకు కొత్త ఆశలు, నమ్మకాన్ని కలిగిస్తోందని ఆయన అన్నారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ అమరావతిని ఆధునిక, అభివృద్ధి చెందిన రాజధానిగా తీర్చిదిద్దే ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. కేంద్రం సహకారం, కూటమి ప్రభుత్వ కార్యాచరణ అమరావతి అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయని, రాబోయే రోజుల్లో రాజధాని నిర్మాణంలో మరిన్ని కీలక మైలురాళ్లు ఆవిష్క ృతం కానున్నాయని ఆయన పేర్కొన్నారు.

# 14న తిరంగా ర్యాలీ

**కాళీమాత గుడి వద్ద గురువారం ఉదయం 7 గంటలకు ర్యాలీ**
**13 నుండి 15 వరకు(3 రోజులు) ఇళ్లపై జాతీయ జెండా**
**ఇంచార్జ్ కలెక్టర్ జి. విద్యాధరి**

**విశాఖపట్నం, ఆగస్టు 12:.** 80 వ స్వాతంత్ర్య దినోత్సవం లో భాగంగా దేశ భక్తిని పెంపొందించే పలు కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగా ఈ నెల 13 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇంచార్జ్ కలెక్టర్ జి. విద్యాధరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 న ఉదయం 7గంటలకు కాళీమాత గుడి వద్ద నుండి జిల్లా స్థాయి లో తిరంగా ర్యాలీ జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ రాలీ లో జిల్లా కలెక్టర్ , జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయి లో జరిగే ఈ ర్యాలీ కోసం జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ తిరంగా ర్యాలీ లను జిల్లాలోని అన్ని మండలాల్లో, జోనల్ స్థాయి లో నిర్వహించాలని, విద్యార్థులు, యువత, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రతి ఇంటిపై,వాణిజ్య సంస్థలపై , ప్రభుత్వ కార్యాలయాలపై రాబోయే 3 రోజుల పాటు (13 నుండి 15 వరకు) జాతీయ జెండా ఎగురవేసి ఉంచాలని , 14 వ తేదీ మొక్కలు నాటే కార్యక్రమం లో పాల్గొవాలని, ప్రభుత్వ కార్యాలయాలు,కూడళ్లు త్రివర్ణ విద్యుత్ దీపాలతో అలంకరించాలని ,15 వ తేదీన 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొవాలని కోరారు.

# అనీమియా రహిత జిల్లా సాధనే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలి



**విశాఖపట్నం, ఆగస్టు 12 :** జిల్లాలోని పాఠశాల విద్యార్థులను రక్తహీనత బారి నుంచి బయటపడేసి, డిసెంబర్ -2026 నాటికి అనీమియా రహిత పాఠశాలలుగా తీర్చిదిద్దాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం చేపడుతున్న 12స12 క్యాంపెయిన్ అమలుపై బుధవారం కలెక్టరేట్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. 12 సంవత్సరాల వయస్సు గల ప్రతి విద్యార్థిలో కనీసం 12 గ్రాముల హిమోగ్లోబిన్ స్థాయి ఉండేలా చూడడమే 12స12 క్యాంపెయిన్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటికే నిర్వహించిన తొలి విడత హిమోగ్లోబిన్ పరీక్షల ఫలితాలను పరిశీలించగా గణనీయ సంఖ్యలో విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు తేలిందని, దీని నివారణకు ఈ విద్యాసంవత్సరం ముగిసే నాటికి విద్యార్థులందరినీ అనీమియా రహితులుగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి పని చేయాలని పేర్కొన్నారు. రక్తహీనత తీవ్రతను బట్టి విద్యార్థులకు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా అందిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి పాఠశాలలో చురుకైన విద్యార్థులను హెల్త్ అంబాసిడర్లుగా గుర్తించి ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం కింద అందిస్తున్న చిక్కీ, రాగిజావ వంటి పోషకాహార పదార్థాలను ప్రతి విద్యార్థి తప్పనిసరిగా తీసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రక్తహీనత వల్ల కలిగే దుష్పరిణామాలపై తల్లిదండ్రుల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఇందుకు వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖలు సంయుక్తంగా పనిచేయాలని సూచించారు. ప్రత్యేకంగా కౌమార బాలికల ఆరోగ్యంపై దృష్టి సారించాలని పేర్కొన్న జాయింట్ కలెక్టర్, రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఐరన్ అవసరం వంటి అంశాలపై పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. డిసెంబర్ 2026 నాటికి విశాఖపట్నం జిల్లాను అనీమియా రహిత పాఠశాలల జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని స్థాయిల్లో సమన్వయంతో కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమకుమార్, ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, కేజీహెచ్ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.వి. రమణ, ఆర్బీఎస్కే జిల్లా సమన్వయకర్త, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# భోగాపురంలో ప్రత్యేక విమానం ల్యాండింగ్


## న్యూఢిల్లీ నుంచి వచ్చిన గంటా, సీఎం రమేష్



**విశాఖపట్నం, ఆగస్టు 12:** భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకల సందడి మొదలైంది. వాస్తవానికి ఈనెల 17 వ తేదీ తర్వాత రెగ్యులర్ విమాన సర్వీస్ లు ప్రారంభమవుతాయని పౌర విమానయాన శాఖ ప్రకటించింది. అయితే ఆ సమయానికన్నా ముందే ప్రత్యేక విమానాల ల్యాండింగ్ మొదలైంది. ఢిల్లీ నుంచి భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ లు బుధవారం ప్రత్యేక విమానంలో భోగాపురం విమానాశ్రయంలో దిగగా.. మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు తదితరులు ప్రత్యేక విమానంలో వెళ్తూ కాకతాళీయంగా కలుసుకున్నారు. ఇక్కడ విమానాల టేక్ ఆఫ్ కు అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలను కల్పించారు. అలాగే విశాఖ నుంచి కనెక్టివిటీ కోసం మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఎలివేటెడ్ బీచ్ కారిడార్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఆర్టీసీ 16 ఎలక్ట్రికల్ బస్సులను భోగాపురం విమానాశ్రయం వరకు ఇప్పటికే ట్రయిల్ రన్ నడిపారు. మెట్రో కూడా సాధ్యమైనంత త్వరగా పట్టాలెక్కేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రత్యేక విమానాల రాకపోకలు మొదలవడంతో ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్ గా చెప్పుకునే భోగాపురం విమానాశ్రయం హడావిడి ప్రారంభమై సందడి షురూ అయ్యింది.

# ప్రజా పంపిణీ వ్యవస్థ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలి

**జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి**



**విశాఖపట్నం, ఆగస్టు 12:** ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నాణ్యమైన సరుకులు సకాలంలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, రేషన్ పంపిణీ, దీపం-2 పథకం, ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలు, మీ మార్ట్ కార్యక్రమాల పురోగతిని ఆమె సమీక్షించారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ అమలులో ఎటువంటి లోపాలకు తావు లేకుండా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు.

జిల్లాలో ప్రస్తుతం 642 ఫెయిర్ ప్రైస్ దుకాణాల ద్వారా 5,28,863 రేషన్ కార్డులకు చెందిన సుమారు 16 లక్షల మంది లబ్ధిదారులకు సేవలు అందుతున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో రేషన్ సరుకుల నాణ్యత, సరఫరా, పంపిణీ ప్రక్రియలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జేసీ సూచించారు. అన్ని ఫెయిర్ ప్రైస్ దుకాణాల్లో ఈ-పాస్ విధానం సమర్థవంతంగా అమలవుతోందని, వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించే డోర్ డెలివరీ సేవలను మరింత మెరుగుపరచాలని ఆమె సూచించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్, ప్రధానమంత్రి పోషణ శక్తి నిర్మాణ్ పథకాల కింద పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహార సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సంక్షేమ హాస్టళ్లకు కేటాయించే బియ్యం పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దీపం-2 పథకం అమలులో అర్హులైన లబ్ధిదారులందరికీ సబ్సిడీ ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని, ఎల్పీజీ కనెక్షన్లకు సంబంధించిన సేవలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలని ఆమె పేర్కొన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ కింద రైతు బజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాల పనితీరును సమీక్షించిన ఇంచార్జి కలెక్టర్, నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు వినియోగదారులకు అందించేందుకు చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా బహిరంగ మార్కెట్లో ధరల నియంత్రణకు తోడ్పాటు అందించాలన్నారు. అలాగే జిల్లాలో 75 ఫెయిర్ ప్రైస్ దుకాణాల్లో అమలు చేస్తున్న 'మీ మార్ట్' కార్యక్రమాన్ని మరింత విస్తరించి, రేషన్ కార్డు దారులకు అవసరమైన నిత్యావసర వస్తువులు ఒకేచోట లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఫెయిర్ ప్రైస్ దుకాణాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఇంచార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు.

సమావేశంలో డీఎస్వో భాస్కరరావు, ఏఎస్వో కళ్యాణి, సివిల్ సప్లైస్ డీఎం సృజన, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె. రామారావు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేశ్, లీగల్ మెట్రాలజీ ఏసీ రాధాకృష్ణ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు, పలువురు డీలర్లు, చెకింగ్ ఇన్స్పెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం



**విశాఖపట్నం, 12 ఆగస్టు 2026:** భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) విశాఖపట్నం ఆధ్వర్యంలో ఈరోజు స్థానిక గాయత్రి డిగ్రీ పీజీ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ బి. రుత్విక్, IRS (అసిస్టెంట్ డైరెక్టర్, ఇన్వెస్టిగేషన్) మాట్లాడుతూ, యువత ఆరోగ్యం, ఉన్నత ఆశయాలే దేశానికి నిజమైన సంపద అని అన్నారు. క్రమశిక్షణను అలవర్చుకుని మాదకద్రవ్యాల మహమ్మారి నుండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని విద్యార్థులను కోరారు. సీబీసీ విశాఖపట్నం క్షేత్ర ప్రచార అధికారి (FPO) శ్రీ శ్రీరామమూర్తి కందాళ, ఐఐఖి ప్రసంగిస్తూ, మాదకద్రవ్య రహిత జీవితం అనే సందేశాన్ని కేవలం కళాశాలకే పరిమితం చేయకుండా తమ ఇళ్లకు, సమాజంలోకి తీసుకెళ్లి, ఈ కార్యక్రమానికి చురుకైన రాయబారులుగా యువత వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల యూజీ కోర్సుల డైరెక్టర్ శ్రీ డి. గిరిధర్, ప్రిన్సిపాల్ శ్రీమతి శేష పద్మ దిట్టకవి, ఎంవీపీ పోలీస్ స్టేషన్ శక్తి టీమ్ సబ్-ఇన్స్పెక్టర్ శ్రీమతి భాగ్య శ్రీ తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రైవేట్ రిజిస్టర్డ్ ట్రూప్ (PRT) కళాకారులు ప్రదర్శించిన ప్రత్యేక జానపద నాటకం వ్యసనాల వల్ల కలిగే ప్రమాదాలను అత్యంత ప్రభావవంతంగా తెలియజేసింది. ఆరోగ్యవంతమైన, మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థులు, అధ్యాపకులు సామూహిక ప్రతిజ్ఞ చేయడంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# లిక్విడ్ గంజాయి కేసులో ఫార్వర్డ్ లింక్ ముద్దాయి అరెస్ట్

## విద్యార్థులకు సరఫరా చేస్తున్న ముఠా బట్టబయలు



**భీమునిపట్నం, మనం న్యూస్ :** విశాఖపట్నం సిటీ పోలీస్ కమీషనర్ శంకబ్రత బగ్చి ఆదేశాలతో భీమిలి పోలీసులు లిక్విడ్ గంజాయి సరఫరా గొలుసును పూర్తిగా ఛేదించారు. మూడు రోజుల క్రితం జొన్నాడ టోల్గేట్ వద్ద లిక్విడ్ గంజాయి ముద్దాయిలను అరెస్ట్ చేసిన భీమిలి పోలీసులు, 24 గంటల్లోపే బాక్వార్డ్ లింక్ అయిన పాంగి ని ఒడిస్సా రాష్ట్రం, బలిగూడ జిల్లాలో అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా 48 గంటల్లో ఫార్వర్డ్ లింక్ అయిన విజయవాడకు చెందిన రాము ని అరెస్ట్ చేశారు. నిందితుడు రాము విజయవాడలోని విద్యార్థులకు మరియు అలవాటున్న వారికి చిన్న చిన్న ప్యాకెట్లుగా విడగొట్టి గంజాయిని విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. గంజాయి సరఫరా పై ఉక్కుపాదం మోపుతున్నామని భీమిలి సి.ఐ దివాకర్ యాదవ్ తెలిపారు. భీమిలి ఏరియాలో ఎక్కడైనా గంజాయి అమ్మకం, నిల్వ లేదా వినియోగం జరుగుతున్నా వెంటనే సి.ఐ కి సమాచారం ఇవ్వగలరు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలియచేసారు.

# ప్రజా ప్రతినిధులు ప్రశ్నిస్తున్నా అధికారులు స్పందించరా?

**ప్రమాదం జరిగితేనే కలెక్టర్ స్థాయి అధికారులు స్పందిస్తారా?**

**రూ.2.55 కోట్ల భవన నిర్మాణంలో నాసిరకం బూడిద ఇటుకలపై ఆరోపణలు**

**ఐటీడీఏ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే పనులు.. అయినా పర్యవేక్షణ ఏది?**

**గిరిజన విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు, స్థానికుల్లో ఆందోళన**

**పోలవరం జిల్లా (చింతూరు, మనం న్యూస్) ఆగస్టు 12:** అధికారులు స్పందించాలంటే ముందుగా ఏదైనా ప్రమాదం జరగాల్సిందేనా..? ప్రజా ప్రతినిధులు, స్థానికులు ప్రశ్నిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు..? పత్రికల్లో వరుస కథనాలు వచ్చినా సంబంధిత అధికారులు కనీసం నిర్మాణ పనులను పరిశీలించకపోవడానికి కారణమేంటి..? అంటూ చింతూరు ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం కొత్త జిల్లాను కేవలం 12 మండలాలనే ఒక జిల్లాగా ఏర్పాటు చేసి, పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో మాత్రం కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుదూర ప్రాంతాల్లో నివసించే గిరిజన ప్రజలకు విద్య, వైద్యం, రహదారులు, మౌలిక వసతులు అందించాలనే ఉద్దేశంతో పరిపాలనా వ్యవస్థను విస్తరించినప్పటికీ.. అధికారులు మాత్రం కార్యాలయాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఐటీడీఏ కార్యాలయం పక్కనే నాసిరకం నిర్మాణమా?**

చింతూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి అదనపు భవన నిర్మాణం జరుగుతోంది. సమగ్ర శిక్ష అభియాన్ నిధులతో కోట్లాది రూపాయల వ్యయంతో చేపడుతున్న ఈ నిర్మాణంలో నాసిరకం బూడిద ఇటుకలు వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఇప్పటికే వెలువడ్డాయి.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ నిర్మాణ ప్రాంతం ఐటీడీఏ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉంది. సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, ఉన్నతాధికారులు అందుబాటులో ఉన్నప్పటికీ నిర్మాణ పనులపై పర్యవేక్షణ ఎందుకు కొరవడిందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**పత్రికల్లో కథనాలు వచ్చినా స్పందన కరువేనా?**

భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదంటూ పలు పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మంగళవారం బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గాంధీబాబు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడ నాసిరకం నిర్మాణం జరుగుతున్నట్లు పేర్కొంటూ పత్రికా ప్రకటన చేయడం కూడా చర్చనీయాంశంగా మారింది. అయినా సంబంధిత శాఖల అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు నిలదీస్తున్నారు.

# భక్తులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం

**కొండపై రెండో రోజు ప్రత్యేక పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ డ్రైవ్**



**సింహాచలం, 12 ఆగస్టు 2026:** శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం సింహాచలంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ ఈవో జల్లాపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో కొండపై రెండో రోజు ప్రత్యేక పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ డ్రైవ్ నిర్వహించారు. సానిటరీ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఈవో, భక్తుల సౌకర్యాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, క్యూ లైన్లు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఫ్రీ క్యూ లైన్లను పరిశీలించిన ఈవో, క్యూ లైన్లకు ఆనుకుని ఉన్న వాష్రూమ్లను స్వయంగా పరిశీలించారు. వాష్రూమ్లలో క్లీనింగ్, తలుపులు, గడియలు తదితర వాటిని సరిచేయడంతో పాటు అవసరమైన చిన్నచిన్న మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

వాష్రూమ్ల వద్ద భక్తులకు స్పష్టంగా కనిపించే విధంగా అవసరమైన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూ లైన్లకు ఆనుకుని ఉన్న వాటర్ కూలర్లను ఈవో పరిశీలించారు. కొత్తగా కొనుగోలు చేసిన వాటర్ డిస్పెన్సర్లను ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించి, వాటిని తక్షణమే భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత వాటర్ ఏఈని ఆదేశించారు. ఉచిత ప్రసాదాల పంపిణీ కేంద్రం, వేద పాఠశాల, కేశఖండనశాల తదితర భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కూడా అవసరమైన వాటర్ డిస్పెన్సర్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

భక్తులకు తాగునీరు అందించే స్టీల్ డ్రమ్ములను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ప్రతిరోజూ శుభ్రపరిచిన వివరాలను నమోదు చేసే విధంగా ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహించాలని వాటర్ ఏఈని ఆదేశించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇన్చార్జి రామరాజు, తాతాజీ ఏఈఓ, వాడ్రేవు రమణమూర్తి, కె. తిరుమలేశ్వరరావు, పిల్లా శ్రీనివాస్, పర్యవేక్షణ అధికారి రాజ్యలక్ష్మి, పాలూరు నర్సింగరావు, ఇంజనీరింగ్ సిబ్బంది తిరుపతిరావు, రవిరాజ్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# జింబాబ్వేలో ఘోర ప్రమాదం పడవ బోల్తా

**15 మంది దుర్మరణం**

**హరారే,ఆగస్టు 12 :** జింబాబ్వేలో ఘోర ప్రమాదం జరిగింది. కరీబా సరస్సులో ప్రయాణికులతో వెళ్తున్న ఓ పడవ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 15 మంది మృతి చెందారు. మరో 27 మంది గల్లంతయ్యారు. ప్రమాద సమయంలో పడవలో 114 మంది ప్రయాణికులతోపాటు ఐదుగురు సిబ్బంది ఉన్నారు. టికెట్లు తీసుకోని చిన్నారులు కూడా ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. దీంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సహాయక చర్యల కోసం హెలికాప్టర్లతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం అనంతరం 77 మంది ప్రయాణికులు ప్రాణాలతో బయటపడి సరస్సులోని ఓ చిన్న ద్వీపానికి చేరుకున్నారు. ఆ పడవ సామర్థ్యం 90 మందే అని.. అంతకంటే ఎక్కువ మందిని ఎక్కించుకోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. కరీబా సరస్సు జింబాబ్వే-జాంబియా సరిహద్దులో ఉంది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కరీబా పట్టణానికి వెళ్లేందుకు పడవలు ఉపయోగిస్తుంటారు.

# పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన టూరిజం ఎండీ



**అమరావతి,ఆగష్టు,12,(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) మేనేజింగ్ డైరెక్టర్గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి పట్టన్ శెట్టి రవి సుభాష్ సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగాభివృద్ధికి తీసుకోవాల్సిన పలు కీలక చర్యలపై వారిద్దరి మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. బాధ్యతలు చేపట్టిన నూతన ఎండీకి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ముందంజలో నిలిపేందుకు క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ భేటీలో భాగంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను గుర్తించి, అక్కడ పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపకల్పన చేయాలని దిశానిర్దేశం చేసారు. అదే విధంగా ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా ఎకో-టూరిజం, ఆరోగ్యం-ఆహ్లాదాన్ని అందించే వెల్ నెస్ టూరిజం ప్రాజెక్టులకు పెద్దపీట వేయాలన్నారు. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్షిప్ విధానంలో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, ఇప్పటివరకు కుదుర్చుకున్న ఒప్పందాలు త్వరగా పట్టాలెక్కేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన పర్యాటక పాలసీ, దాని అనుబంధ విధానాలపై సమగ్రంగా చర్చించడంతో పాటు, పర్యాటక రంగ నిపుణులు, ఇన్వెస్టర్ల నుంచి వచ్చిన ఫీడ్బ్యాక్ను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. స్టేట్ ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ బోర్డు, స్టేట్ ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ కమిటీ పరిధిలో ఇప్పటివరకు ఆమోదం పొందిన ప్రాజెక్టుల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్ర పర్యాటక వైభవాన్ని చాటిచెప్పేలా ప్రాంతీయ పర్యాటక ఉత్సవాలు నిర్వహించాలని, దేశ విదేశాల్లో ఏపీ టూరిజంకు విస్తృత ప్రచారం కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, మంత్రి దుర్గేష్ దిశానిర్దేశం మేరకు రాష్ట్ర పర్యాటక రంగాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తానని ఏపీటీడీసీ ఎండీ పట్టన్ శెట్టి రవి సుభాష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# వరుణుడి కరుణ కోసం 108 కళాశాల జలంతో స్వామి వారికి జాలాభి షేకం



పాలకొల్లు, ఆగష్టు 12 మనం ప్రతినిధి: పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానము నందు శ్రీ స్వామివారికి జలాభిషేకం సందర్భంగా తేదీ 10. 8. 2026 సోమవారం అనగా ఈరోజు ఉదయం ఏడు గంటలకు శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి పూజ శ్రీ స్వామివారికి 108 కలశములతో బ్రాహ్మణులు అభిషేకం ఏకాదశ రుద్రములతో అభిషేక పండితులతో స్వస్తి మంత్రాలతో స్వామివారి 108 కలశములు పూజలు రుత్వికులతో రుద్ర పారాయణ చేయుట పున పూజ దేవతలను ఆరాధన చేయుట మొదలగునవి పూజా కార్యక్రమము లో భాగముగా మొదలగునవి పూజా కార్యక్రమాలు జరిగినవి. క్షీరా రామలింగేశ్వర స్వామి వారికి భక్తులు దాతలు శ్రీ స్వామివారి కలశములను బ్రాహ్మణులకు అందజేసినారు వారు శ్రీ స్వామివారికి జలాభిషేకం చేయడం జరిగినది. శ్రీ స్వామివారికి జలాభిషేకం చేయుటకు 108 కలశములతో భక్తులు సుమారుగా 350 మంది మెయిన్ కాలువ దగ్గరకు ఊరేగింపుగా వెళ్లి కలశముల నిండా నీళ్లు పట్టి తిరిగి శ్రీ స్వామివారి దేవాలయమునకు వచ్చి స్వామివారికి జల అభిషేకములు చేయుట జరిగింది. ఈ పూజా కార్యక్రమాలు అన్నియు అభిషేక పండిట్లు బమ్మిడిపాటి వెంకన్న గారు మద్దూరు సూరిబాబు గారు ఆలయ ప్రధాన అర్చకులు కిష్టప్ప గారు అనిల్ గారు వీరబాబు గారు సుమారు 25 మంది రుత్వికులు తో పూజలు నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు ఆలయ చైర్మన్ మీసాల రామచంద్ర రావు, సూపరింటెండెంట్ వాసు,ఆలయ ధర్మకర్తలు ఉప్పలపు దుర్గ పెద్దిరాజు, హోత ప్రవాలా, నాలామ్ నాగ వెంకట సురేఖ, పినిశెట్టి శ్రీనివాసు,కొండ్రెడ్డి సూర్యనారాయణ, పెన్మెచ్ శ్రీదేవి, బాసిన అప్పల నాగ సత్యనారాయణ, వందరపు శ్రీనివాసు నీ లాపు సింహాచలం,నీలాపుమని మొదలు వారు పాల్గొన్నారు..

# సత్యగిరి దేవస్థాన భూముల సర్వేకు ఆటంకం

● ఈఓ చర్చలతో సద్దుమణిగిన వివాదం



అన్నవరం, ఆగస్టు 12, మనం న్యూస్ : అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి చెందిన సత్యగిరి కొండ భూముల సరిహద్దుల నిర్ధారణ, భూముల సర్వే ప్రక్రియ గత మూడు రోజులుగా శాంతియుతంగా, పారదర్శకంగా కొనసాగుతోంది. దేవస్థాన భూముల పూర్తి వివరాలను గుర్తించి, సరిహద్దులను పక్కాగా నిర్ధారించే లక్ష్యంతో అధికారులు సర్వే పనులను నిర్వహిస్తున్నారు. సర్వేలో భాగంగా బుధవారం అధికారులు తమ విధులు నిర్వహిస్తుండగా, స్థానికంగా సంబంధం ఉన్న కొందరు వ్యక్తులు సర్వే ప్రక్రియకు ఆటంకం కలిగించేందుకు ప్రయత్నించారు. దీంతో కొద్దిసేపు అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఏర్పడింది. విషయం తెలుసుకున్న దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ నల్లం సూర్యచక్రధరరావు వెంటనే అక్కడికి చేరుకుని, సర్వేకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న వారితో నేరుగా మాట్లాడారు. దేవస్థానానికి సంబంధించిన భూముల సరిహద్దుల నిర్ధారణ, సమగ్ర సర్వే సక్రమంగా పూర్తయితే భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలకు తావు లేకుండా అందరికీ మేలు జరుగుతుందని వారికి వివరించారు. ఎవరైనా వ్యక్తులు సర్వే ప్రక్రియపై అభ్యంతరాలు లేదా సమస్యలు కలిగి ఉంటే, సర్వే పనులను అడ్డుకోవడం సరైన విధానం కాదని ఈఓ స్పష్టం చేశారు. సర్వే పూర్తయిన అనంతరం తమ అభ్యంతరాలను రాతపూర్వకంగా కార్యనిర్వహణాధికారికి సమర్పించవచ్చని సూచించారు. సంబంధిత రికార్డులు, ఆధారాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం వాటిని పరిశీలించే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా, ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియకు ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగిస్తే, నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఈఓ హెచ్చరించారు. దేవస్థాన భూముల పరిరక్షణ అత్యంత కీలకమైన అంశమని, దేవస్థాన ఆస్తులకు ఎలాంటి నష్టం లేదా ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవడం తమ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈఓ సూర్యచక్రధరరావు శాంతియుతంగా, సమన్వయంతో సమస్యను పరిష్కరించేందుకు చేసిన ప్రయత్నానికి సానుకూలంగా స్పందించిన స్థానికులు తమ అభ్యంతరాలను నిబంధనల ప్రకారం తెలియజేస్తామని అంగీకరించారు. దీంతో అక్కడ ఏర్పడిన వివాదం సద్దుమణిగింది. అనంతరం సర్వే సిబ్బంది తిరిగి తమ పనులను ప్రారంభించడంతో సత్యగిరి కొండ భూముల సర్వే ప్రక్రియ యథావిధిగా, సజావుగా కొనసాగింది. దేవస్థాన భూముల పరిరక్షణకు సర్వే కీలకం... దేవస్థానానికి చెందిన భూముల పూర్తి స్థాయి సర్వే ద్వారా భూముల విస్తీర్ణం, సరిహద్దులు, అందుబాటులో ఉన్న రికార్డులు తదితర అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలు, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడానికి కూడా ఈ సర్వే దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. మొత్తంగా, సత్యగిరి దేవస్థాన భూముల సర్వే సమయంలో తలెత్తిన స్వల్ప వివాదాన్ని ఈఓ స్వయంగా జోక్యం చేసుకుని చర్చల ద్వారా పరిష్కరించడం, అనంతరం సర్వే పనులు తిరిగి ప్రశాంతంగా కొనసాగడం ప్రాధాన్యత సంతరించుకుంది. దేవస్థాన ఆస్తుల పరిరక్షణతో పాటు స్థానికుల అభ్యంతరాలను నిబంధనల మేరకు పరిశీలించే విధంగా అధికారులు వ్యవహరించడం గమనార్హం.

## మంత్రి అచ్చం నాయుడుకు ఆక్వా రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు అందజేత



పాలకొల్లు, ఆగష్టు 12 మనం ప్రతినిధి : ఏపీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చం నాయుడుకు ఏపీ రాష్ట్ర ఆక్వా సంఘ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభవన్రాజు మంగళవారం ఆక్వా రైతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ఒక వినతి పత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి అచ్చం నాయుడు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ వినతి పత్రం అందజేసిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి త్సవటపల్లి నాగభూషణం, బోనం వెంకట నరసయ్య, కొటికల కలపూడి కృష్ణ శ్రీ, సజ్జ వీర వెంకట సత్యనారాయణ, మల్ల రాంబాబు,పి సత్యనారాయణ రాజు, మేడిది జాన్ డేవిడ్ రాజు, మేక పనింద్ర ప్రసాద్, తదితరులు ఉన్నారు.

## జెండా మన శక్తి దేశం మన భక్తి




● ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

ఏలేశ్వరం,ఆగస్టు, 12:-(మనం న్యూస్): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం శ్రీ సూర్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో తిరంగా వైభవ ర్యాలీ నిర్వహించారు. శ్రీ సూర్య విద్యా సంస్థల చైర్మన్ కోలుమల్ల వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమములో విద్యార్థులచే 325 అడుగుల భారీ జాతీయ జెండాతో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. భారత్ మాత కి జై,,, జెండా మన శక్తి- దేశం మన భక్తి,,, జెండా మన గర్వం-దేశం మన ప్రాణం.. అను నినాదాలలో గ్రామంలో ర్యాలీ కొనసాగించారు.. ఈ సందర్భంగా విద్యా సంస్థల యాజమాన్యం మాట్లాడుతూ.శ్రీ సూర్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో 325 అడుగుల జాతీయ ను కళాశాల పాఠశాల విద్యార్థులతో గ్రామంలో భారీ ర్యాలీ చేపట్టామని ముఖ్యంగా జాతీయ జెండా ర్యాలీని నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, క్రమశిక్షణ మరియు సామాజిక బాధ్యతా భావాన్ని పెంపొందించడమే మా కళాశాల యాజమాన్యం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ సూర్య మేనేజింగ్ డైరెక్టర్ లు, కొలుమల్ల నవజగన్, కొలుమల్ల రేణుకా సౌజి, కాలేజీ ప్రిన్సిపాల్ వై శేఖర్, స్కూల్ ఇంచార్జి జి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు టి, శ్రీనివాస్, రామిశెట్టి విష్ణు, పాఠశాల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు,నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.25 లక్షల తో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సత్య ప్రభ శంకుస్థాపన



● ఇంటింటికీ కూటమి సంక్షేమ పాలన ప్రచారం

ప్రత్తిపాడు ఆగష్టు 12 మనం న్యూస్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. బుధవారం మండలంలోని పాండవులపాలెం ఎంపీ సానా సతీష్ బాబు నిధులు తో రూ. 15 లక్షలు తో కమ్యూనిటీ హాల్ కు ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అలాగే వేములపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో రూ. 13.5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదిని ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు పనులు..**

అనంతరం ఎరకంపాలెం గ్రామంలో రాజ్యసభ సభ్యులు సాన సతీష్ బాబు ఎంపీ నిధులు రూ. 10 లక్షల వ్యయంతో వినాయకుడి గుడి వద్ద నుంచి శివాలయం వరకు నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

**ఇంటింటికీ సంక్షేమ ఫలాలు..**

వేములపాలెంలో నిర్వహించిన 'కూటమి రెండేళ్ల పాలన - అభివృద్ధి, సంక్షేమం' ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత మేడిశెట్టి బాబి, టిడిపి నేత రెడ్డి అమర్నాథ్ చౌదరి, ఇల్లా అప్పారావు, నిమ్మల రాంబాబు, లొండ లోవరాజు, తూము కొండబాబు,తలంపంటి బుజ్జి, శిరం శ్రీను,ఎంఈఓ వి రాజుబాబు, పిఆర్ జెఈ ఎం సత్య ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి లు మణికంఠ, శ్రీనివాస్, హెచ్ఎం సిహెచ్ వి సూర్య వతి, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ విద్యార్థుల మాదక ద్రవ్యాల అవగాహన ర్యాలీ

ఏలేశ్వరం,ఆగస్టు 12(మనం న్యూస్): మాదకద్రవ్యాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుంటే వాటి నిర్మూలన సాధ్యపడుతుందని ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డివివి సత్యనారాయణ అన్నారు.బుధవారం ఏలేశ్వరం లింగంపల్లి రోడ్ లో గల ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ నుంచి విద్యార్థులు త్రివర్ణ పతాకాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నగర పంచాయతీ మాజీ చైర్పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య. ప్రముఖ వ్యాపారవేత్త ఊర కృష్ణ,ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులతో పాటు లయన్స్ సభ్యులు పాల్గొని మాదకద్రయ్యల నిర్మూలనకే నినాదాలు చేశారు.ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ స్థానిక బాలాజీ సెంటర్ వరకు సాగింది.ఈ సందర్భంగా కరెస్పాండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ నేటి యువతరం పూర్తి అవగాహన లేకపోవడం కారణంగానే మాదకద్రవ్యాల బారినబడి వారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు అన్నారు.యువత భవితను ప్రాణాలను హరిస్తున్న మాదకద్రవ్యాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉన్నాడే వాటి నిర్మూలన సాధ్యపడుతుందని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ పీవీ శేషాచార్యులు అకాడమిక్ డైరెక్టర్ స్రవంతి ప్రిన్సిపల్ ఎస్ వంశీకృష్ణ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పథకాన్ని తక్షణమే పునఃప్రారంభించాలి




● ఖాళీ ప్లేట్లతో విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నిరసన

అన్నవరం, ఆగస్టు 12, మనం న్యూస్ : సత్యదేవ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) శంఖవరం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. కళాశాల నుంచి టోల్గేట్ వరకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు అనంతరం ఖాళీ ప్లేట్లతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. గంగా సూరిబాబు, జిల్లా కమిటీ సభ్యుడు ఉదయ్కుమార్ మాట్లాడుతూ సత్యదేవ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సుమారు 40 గ్రామాల నుంచి పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉదయాన్నే మొదటి బస్సుల్లో కళాశాలకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన కొద్దికాలానికే నిలిపివేయడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నుంచి భోజనం తీసుకురాలేని విద్యార్థులు కళాశాలలో భోజనం అందక మంచినీటితో ఆకలిని తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఎవరో ఇచ్చిన ఫిర్యాదును కారణంగా చూపి పేద విద్యార్థులకు భోజనం నిలిపివేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ నాయకులు విమర్శించారు. ఇతర దేవస్థానాల ఆధ్వర్యంలోని విద్యాసంస్థల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాలు అమలవుతున్నప్పుడు, పెద్ద దేవస్థానంగా ఉన్న అన్నవరం దేవస్థానం పరిధిలోని విద్యాసంస్థల్లో ఈ పథకాన్ని ఎందుకు కొనసాగించలేకపోతున్నారని ప్రశ్నించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి సత్యదేవ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని త్వరితగతిన పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి మరింత పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ శంఖవరం మండల కార్యదర్శి ఏసుబాబు, మండల నాయకులు రామకృష్ణ, కళాశాల కమిటీ అధ్యక్షుడు లోహిత్, కార్యదర్శి శివ, కమిటీ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతిష్ఠాత్మక అవార్డు గ్రహీత ఈఓ సూర్యచక్రధరరావుకు అభినందనలు



అన్నవరం, ఆగస్టు 12, మనం న్యూస్ : తెలుగు ఛానల్ అందించే ప్రతిష్ఠాత్మక అవార్డును అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ నల్లం సూర్యచక్రధరరావు అందుకున్న సందర్భంగా దేవస్థానం ఉద్యోగులు ఆయనకు బుధవారం నాడు ఘనంగా అభినందనలు తెలిపారు. దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆలయ నిర్వహణలో చేపడుతున్న పలు కార్యక్రమాలను గుర్తిస్తూ తెలుగు ఛానల్ వారు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందజేశారు. ఈ అవార్డు ఈఓ సూర్యచక్రధరరావు సేవలకు లభించిన గుర్తింపుగా ఉద్యోగులు అభివర్ణించారు. ఈ సందర్భంగా దేవస్థానంలోని వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు కార్యనిర్వహణాధికారి సూర్యచక్రధరరావును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో దేవస్థానం మరింత అభివృద్ధి చెందాలని, భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. అవార్డు అందుకోవడం పట్ల ఈఓ సూర్యచక్రధరరావు సంతోషం వ్యక్తం చేస్తూ, దేవస్థానం అభివృద్ధిలో ఉద్యోగులు, అధికారులు, భక్తుల సహకారం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అందరి సమిష్టి కృషితో రత్నగిరి క్షేత్రాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొని ఈఓకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కోట సుబ్రహ్మణ్య శర్మ, వేద పండితులు గొల్లపల్లి సుబ్రమణ్య ఘణాపాటి, చిట్టి శివ, గంగ బాబు, వ్రత పురోహిత ముఖ్యులు కన్నబాబు, సీనియర్ అసిస్టెంట్ గంటా విష్ణు తదితరులు ఉన్నారు.

## ఏలేశ్వరం లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకార మహోత్సవం




ఏలేశ్వరం,ఆగస్టు 12(మనం న్యూస్):పట్టణంలోని స్థానిక సాయి శుభ ఫంక్షన్ హాల్ లో లయన్స్ క్లబ్ జోనల్ చైర్ పర్సన్ అనుసూరి నాగేశ్వరరావు అధ్యక్షతననూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్టిపుల్ కౌన్సిల్ చైర్పర్సన్ డివిఎస్ రాజు హాజరయ్యారు.నూతన అధ్యక్షుడి గా వూర రాజబాబును, కార్యదర్శిగా గొల్లపూడి గణేష్ రామకృష్ణ,కోశాధికారిగా తండూరి రామారావు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో జి ఎల్ టి కోఆర్డినేటర్ కలిదిండి సత్యనారాయణ రాజు,జోనల్ చైర్ పర్సన్ అనుసూరి నాగేశ్వరరావు, రీజనల్ చైర్ పర్సన్ కే ఆర్ వి వి రమణ,లయన్స్ సభ్యులు జ్యోతుల నాగ శ్రీనివాస్,పర్వత జానకి దేవి,సకిరెడ్డి విజయబాబు, తాళ్లూరి గొల్లజీరావు,కోట శ్రీనివాస్ చక్రవర్తి,గోళ్ళ నాగేశ్వరరావు,రౌతు సహదేవుడు,అలమండ ప్రసాదు,నర్ల చిదంబరం,కప్పల నాగభూషణం ఏవీ గోపాలకృష్ణ ఊర నాని తదితరులు పాల్గొన్నారు.

## ఆహ్లాదానికి చిరునామాగా పార్కుల అభివృద్ధి

● మంత్రి నిమ్మల

పాలకొల్లు, ఆగష్టు 12(మనం ప్రతినిధి): పట్టణ ప్రజలు కుటుంబ సమేతంగా ఆనందంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేలా పార్కులను ఆరోగ్యకరమైన వాతావరణంతో సుందరీకరిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు పట్టణ అభివృద్ధిలో భాగంగా కోట్లాది రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను రాత్రి వరకు కూటమి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పట్టణంలోని నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, డాక్టర్ అబ్దుల్ కలాం ఉద్యానవనం, మున్సిపల్ కొత్త కుళాయి చెరువు గట్టు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను మంత్రి పరిశీలించారు. సంబంధిత అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా పార్కులు, చెరువు గట్టు ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. చిన్నారులు, యువత, వృద్ధులు కుటుంబ




సభ్యులతో కలిసి సేదతీరేలా ఉద్యానవనాలను తీర్చిదిద్దుతు న్నామన్నారు. పాలకొల్లు పట్టణానికి కొత్త రూపు తీసుకురావాలన్నదే లక్ష్యం. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు. నిర్ణీత ప్రమాణాల ప్రకారం పనులు చేపట్టి, త్వరితగతిన పూర్తి చేయాలి. ప్రజలకు అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా వాటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి అని అధికారులను ఆదేశించారు. పట్టణంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రజలకు ఉపయోగపడే శాశ్వత నిర్మాణాలకు ప్రాధాన్యమి స్తున్నామని మంత్రి తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.యూ కబర్ది,పెచెట్టి బాబు, జీవి,జక్కంపూడి కుమార్,పొట్నూరి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఏనుగుల దినోత్సవం



పోడూరు ఆగస్టు 12 మనం న్యూస్ : పర్యావరణ సమతుల్యతను కాపాడుటలో ఏనుగులు ప్రముఖ పాత్ర వహిస్తాయనీ, ఏనుగుల గురించి తెలుసుకుని ఏనుగుల పరిరక్షణ పై అందరూ అవగాహన పెంచుకోవాలని పోడూరు యం ఇ ఓ - 2 జీ. వి. సూర్య నారాయణ అన్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖాధికారుల ఉత్తర్వుల మేరకు బుధవారం పోడూరు మండలం చింతలగరువులో హెడ్మాస్టరు కొల్లాబత్తుల సూర్య కుమార్ అధ్యక్షతన 'ప్రపంచ ఏనుగుల దినోత్సవం' నిర్వహించారు. ఈ కార్యక్రమంకి యం. ఇ. ఓ - 2 జీ.వీ.సూర్యనారాయణ ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులకు ఏనుగుల సంరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఏనుగు చిత్రాలపై డ్రాయింగ్ పోటీ నిర్వహించారు. విద్యార్థినిలు యం.అక్షిత, సి. హెచ్. రూప చేసిన ఏకపాత్రాభినయం, పపెట్ షోలు పలువురిని ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో హెల్త్ స్టాఫ్ యం. అనిత, వి. మాలిని, యం. నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ గ్రంథాలయ దినోత్సవం



గజ్వేల్ ఆగస్టు 12 మనం న్యూస్ : ఆగస్టు 12 జాతీయ గ్రంథాలయ దినోత్సవం గా నిర్వహించుకోవడం జరుగుతుంది. గ్రంథాలయాలు భావితరాలకు ఎంతో అవసరం ఉండేవిధంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలంటారు. కళ్ల ముందు ప్రపంచాన్ని ఉంచుతుంది. ఆలోచనలను విశాలం చేస్తుంది. కొత్త మనిషిగా లోకానికి పరిచయం చేస్తుంది. మట్టికరిచిన మనిషిని సైతం పైకిలేపి నిలబెడుతుంది. 'పుస్తకం మనిషిని ఉన్నతీకరిస్తుందని' అంబేద్కర్ మహాశయుడు అందుకే అన్నాడేమో.! ఫేస్బుక్, ట్విట్టర్ ఖాతాలలో వేలకొద్దీ స్నేహితులున్నా దొరకని ఆత్మస్థైర్యాన్ని ఒక పుస్తకం ఇవ్వగలదు. ఓటీటీ, యూట్యూబ్లలో ఉర్రూతలూగించే వెబ్సిరీస్లు చూసినా కలగని ఆనందాన్ని కూడా పుస్తకంతోనే పొందచ్చు. నగరంలో 83 పౌర గ్రంథాలయాలున్నాయి. ప్రతీ లైబ్రరీలో యువతీ, యువకుల సందోహమే! కాకపోతే వారంతా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు. ఈ తరంలో సాహిత్య పఠనాసక్తిని పెంపొందించడానికి మంచి అవకాశం. కనీసంగా 60మంది లైబ్రేరియన్లనైనా ప్రభుత్వం నియమించడం ద్వారా మన జ్ఞాన భాండాగారాల స్ఫూర్తి నిలుస్తుందన్నది నిపుణుల అభిప్రాయం. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కొండాపూర్లో కోఫోర్జ్ లైబ్రరీ నగరంలో కొత్త సంస్క ృతికి నాంది పలికింది. తెలుగు, హిందీ, ఇంగ్లిషులో 15వేలకుపైగా పుస్తకాలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు 365రోజులూ పాఠకులకు ఐటీ కారిడార్లోని ఆ గ్రంథాలయం ఆహ్వానం పలుకుతోంది. తమకు అవసరమైన పుస్తకాలను సభ్యులు ఇంటి నుంచి వెబ్సైట్, యాప్ లాంటి ఆన్లైన్ వేదికల ద్వారా చదివే వెసులుబాటు ఆ గ్రంథాలయం కల్పిస్తోంది. ఫిన్లాండ్ రాజధాని హెల్సింకిలోని ఓడి సెంట్రల్ లైబ్రరీలో సందర్శకుల కోసం ఆడియో, వీడియో స్టూడియో కూడా అందుబాటులో ఉంచారు. బడంగ్పేటలోని లైబ్రరీలో కాస్తంత మెరుగైన సాంకేతిక సేవలున్నాయని సందర్శకులు చెబుతున్నారు. మన గ్రంథాలయాల్లో పాత పత్రికలు, పుస్తకాలు కొన్ని డిజిటలైజేషన్ అయ్యాయి. కనీసం వాటినైనా పాఠకులకు అందుబాటులో ఉంచాలని సంగిశెట్టి శ్రీనివాస్ కోరుతున్నారు. డిజిటలైజేషన్ చేయాలి అరుదైన రాతప్రతులు, తాళపత్రాలు హైదరాబాద్లో మాత్రమే కొలువుదీరున్నాయి. వాటన్నింటినీ జాగ్రత్తగా డిజిటలైజ్ చేయాలి. లైబ్రరీలు కేవలం రీడింగ్ రూములుగా మిగిలిపోకూడదు. లైబ్రరీలకు రోజూ వస్తున్న పోటీపరీక్షల అభ్యర్థులకు సాహిత్య పుస్తకాలను కూడా అందుబాటులో ఉంచాలి.

# అంగరంగ వైభవంగా చౌడేశ్వరి దేవి బోనాల జాతర..



- ప్రత్యేక పూజల్లో మంత్రి సవిత, ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్..
- సీసీ హరి ఆధ్వర్యంలో బోనాలు

**సోమందేపల్లి టౌన్ ఆగస్టు 12 మనం న్యూస్:** జగన్మాత సృష్టికర్త ప్రపంచ మానవాళికి కొంగు బంగారమై విరాజిల్లు శ్రీ చౌడేశ్వరి మాత జయంతి వేడుకలు మండల కేంద్రమైన సో మందేపల్లిలో బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉజ్జయిని మహంకాళిని తలపించే రీతిలో బోనాలను మండల క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసిహరి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జోలి శాఖ మాత్యులు మంత్రి సవితమ్మ, కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుమునుపు ఉదయం 9 గంటలకు పెద్దమ్మ గుడి ప్రాంగణం నుండి సుమారు 1500 బోనాలతో, యువతులు చిన్నారులు తలపై ఎత్తుకుని గ్రామంలోని పురవీధుల గుండా అమ్మ వారి కీర్తనలు లాలి పాటలు పాడుతూ పాత ఊరిలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయానికి చేరుకొని ఆలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు గావించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మాస్టర్ వీవర్, తోగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి హరి బోనాలకు కావాల్సిన కుండలు, ఇతరత్రా సామాగ్రిని సమకూర్చారు. డప్పు వాయిద్యాలు నడుమ వేదమంత్రాలు నడుమ వేలాది మందితో కూడిన కార్యక్రమం గ్రామంలో కనుల పండుగగా కొనసాగింది. లక్షలాది రూపాయలు వెచ్చించి కార్యక్రమాన్ని సిసిహరి దిగ్విజయం చేయడం పట్ల గ్రామంలోని అన్ని వర్గాల వారు హర్షం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో సీసీ హరి మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండాలని, చేనేతలు ఆర్థికంగా పుంజుకోవాలని, రైతన్నలు బాగుండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులకు, నాయకులకు, స్థానిక విలేకరులకు సన్మాన సత్కారాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేలాదిమంది పాల్గొనగా, గోరంట్ల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రంగన్న గోపాల్, ఆకుల అనిల్, గట్టు మహేంద్ర, పల్లా నరసింహ పలువురు కీలకపాత్రను పోషించారు. చౌడేశ్వరి నామస్మరణతో గ్రామం మార్మోగిపోయింది.

# హత్య కేసును 48 గంటల్లో ఛేదించిన ధర్మవరం పోలీసులు



**ధర్మవరం ఆగస్టు 12 మనం న్యూస్:** హత్య కేసును వేగంగా ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ధర్మవరం డీఎస్పీ జగన్నాథరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్కుమార్ ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టడంతో నిందితులను అదుపులోకి తీసుకున్నా మన్నారు. ఈ కేసు వివరాలను బుధవారం ధర్మవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ జగన్నాథరాజు, ధర్మవరం 1వ పట్టణ సీఐ వి.రెడ్డెప్ప వెల్లడించారు. ఆగస్టు 9న ధర్మవరం 1వ పట్టణ పోలీస్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులో ఓబులనాయనిపల్లి గ్రామానికి చెందిన గడిపూడి గంగాధర్నాయుడు (42), బాల చరణ్కుమార్ (28), గుజ్జల గంగాధర్ అలియాస్ ఎరికిల గంగాధర్ (35)ను ఆగస్టు 11న గొల్లపల్లివంక బ్రిడ్జి సమీపంలోని ధర్మవరం-చిగిచెర్ల రహదారిపై అరెస్టు చేసినట్లు తెలిపారు.

# కనుల పండుగగా చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు

- బర్త్ డే కేక్ ను ఆవిష్కరించిన ఆలయ ధర్మకర్త డిసి ఈశ్వరయ్య

**సోమందేపల్లి టౌన్ ఆగస్టు 12 మనం న్యూస్:** తొగట వీర క్షత్రియులు ఆరాధ్య దైవం కోరుకున్న కోరికలు తీర్చే జగన్మాత సృష్టికర్త చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు మండల కేంద్రమైన సోమందేపల్లి లో ఆలయ ధర్మకర్త డిసి ఈశ్వరయ్య, ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ఆషాడ శుద్ధ అమావాస్య పర్వదినం రోజున అమ్మవారు జయంతి జరుపుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు కుంకుమార్చన సహస్ర కలశాభిషేకం జపతపహుమాలు, అమ్మవారి లాలి సూత్రాలతో వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య కార్యక్రమం నిర్వహిస్తారు. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకునారు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లను ఘనంగా ఏర్పాటు చేశారు ఆలయ



కమిటీ వారు. రాష్ట్ర మంత్రి సవిత, కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, సోమందేపల్లి తాసిల్దార్ మారుతి ప్రసాద్, ఎస్ఐ సుధాకర్ యాదవ్, పలువురు నాయకులు, వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త డి సి ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, చేనేతలు బాగుండాలని, వర్షాలు సకాలంలో కురిసి రైతన్నలు బాగుండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జ్యోతి సంఘం సభ్యులు భక్తులు వేలాది మంది పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో అలసత్వం సహించేది లేదు!



- ప్రజల్లో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెరగాలి
- ప్రతి ఆరోగ్య సూచీలో నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి
- కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి, ఆగస్టు 12 మనం న్యూస్ :** ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం, సంతృప్తి పెరిగేలా వైద్యాధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లాలోని ప్రాథమిక, ద్వితీయ శ్రేణి వైద్యాధికారులతో వివిధ ఆరోగ్య సూచీలపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు.

ప్రతి ఆరోగ్య సూచీలో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. ఐవిఆర్ఎస్ ద్వారా సేకరిస్తున్న ప్రజాభిప్రాయంలో సానుకూల ఫలితాలు వచ్చేలా ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. మాతృ, శిశు మరణాలపై ప్రత్యేక దృష్టి: మాతృ, శిశు మరణాల రేటును గణనీయంగా తగ్గించేందుకు గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, పోషకాహారం అందేలా క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణుల వైద్య పర్యవేక్షణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.

# ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులను పరామర్శించిన ఎమ్మెల్యే



**కదిరి రూరల్ ఆగస్టు 12 మనం న్యూస్:** పట్టణంలోనికదిరి ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు శంకర్ నారాయణ సతీమణి కృష్ణవేణి బుధవారం మృతి చెందడంతో విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వారి నివాసానికి వెళ్లి మృతురాలు కృష్ణవేణి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, శోకసంతప్త కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మృతురాలు కృష్ణవేణి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు.

# ఎడారి నివారణకు ప్రత్యేక నిధులివ్వండి

- కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే, ఎంపీల విజ్ఞప్తి

**రాయదుర్గం, ఆగష్టు 12 మనం న్యూస్:** నియోజకవర్గ పరిధిలోని కనేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ఎడారి నివారణకు రూ.150కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో బుధవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. దక్షిణ భారతదేశంలోనే ఎడారి ఛాయలు వేగంగా విస్తరిస్తున్న రాయదుర్గం ప్రాంతానికి ప్రత్యేకంగా కేంద్ర నిధులు మంజూరు చేయాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని మాల్యం నుంచి దర్గా హొన్నూరు వరకు దాదాపు 20 వేల ఎకరాల విస్తీర్ణంలో ఇసుకమేటలు, ఇసుక దిబ్బలు విస్తరించిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



ఎడారి క్రమంగా విస్తరిస్తుండటంతో స్థానిక ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వీటి నివారణ కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కొంతమేర ప్రయత్నం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో ఆనాడు చర్యలు తీసుకున్నప్పటికీ, అవి పూర్తిగా ఫలప్రదం కాలేదని తెలిపారు. ఏటికేడు ఎడారీకరణ క్రమంగా విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోందని, శాస్త్రీయ అధ్యయనాలు కూడా ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖ్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం రాజస్థాన్లోని ఎడారి ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసిందన్నారు. రాయదుర్గం ప్రాంతంలో ఎడారి నివారణకు తీసుకోవలసిన చర్యలపై బృందం అనేక సిఫార్సులు చేసినట్లు తెలిపారు. అయితే సాధారణ నిధులు ఎడారి నివారణ చర్యల అమలుకు ఏమాత్రం సరిపోవని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కావున రాబోయే మూడేళ్లలో ఉపాధి హామీ పథకం కింద ప్రత్యేకంగా ఎడారి నివారణ కోసం రూ.150 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారానే ఎడారి నివారణ చర్యలు చేపట్టడానికి సాధ్యపడుతుందని వివరించారు. తమ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించారని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి త్వరలోనే తగిన సమాచారం అందజేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు.

# మడకశిరలో ఎచ్ఐవి ఎయిడ్స్ నివారణపట్ల అవగాహన



- ఫోర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బధరీష్

**మడకశిర,ఆగస్టు 12,మనం న్యూస్:** ఇంటెన్సిఫైడ్ ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ (ఐ ఇసి) క్యాంపెయిన్)లో భాగంగా మడకశిర పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎచ్ఐవి,ఎయిడ్స్ నివారణ పట్ల విద్యార్థులకు అవగాహన సదస్సుతో పాటు గోడ పత్రికలను విడుదల చేసినట్లు ఫోర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బధరీష్ తెలిపారు. ఈ కార్యక్రమాలో భాగాగా హెచ్ఐవి,ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్ఐవి,ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న అంశంపై స్పష్టంగా వివరించారు. హెచ్ఐ,యిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలిసి జీవించాలి, హెచ్ఐవి,ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబందం గుర్చి, సుఖ వ్యాధులు, చికిత్స గుర్చి, హెచ్ఐవి,ఎయిడ్స్ ఏక్ట్ 2017 అర్ట్ మందులు, అప్సక్స్ యాప్ ,టోల్ ఫ్రీ నెంబర్ 1097 ,క్యూఆర్ కోడ్ గుర్చి స్పష్టంగా వివరిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఫోర్డ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బదరీష్,ఫోర్డ్ సంస్థ ప్రతినిధి మలింగప్ప, కళాశాల ప్రిన్సిపాల్ గంగప్ప, ఐసీటీసీ కౌన్సిలర్ నరసింహులు, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియేన్ చిట్టిబాబు,కళాశాల సిబ్బంది బాబు, రుహీన, తోటన్న, జమీలా, ఫోర్డ్ ప్రాజెక్టు మేనేజర్ అశ్వత్థ నారాయణ,ఓ అర్ డబ్ల్యూ'ఎస్ లు లలిత, లక్ష్మీదేవి , గీతా, రంగలక్ష్మి , సాకమ్మ,పిఇ లు కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బంగారు కుదువ పేరుతో ఘరానా మోసం

- అర్థ కిలో బంగారానికి రూ.11.70 లక్షలు అప్పు..
- తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుడి ఆందోళన
- పాన్ బ్రోకర్ ఇంటి వద్ద సీపీఐ ఆధ్వర్యంలో రెండు గంటలపాటు నిరసన..
- పోలీసుల జోక్యంతో స్టేషన్కు ఇరువర్గాలు

**హిందూపురం (మనం న్యూస్) ఆగస్టు 12:** శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో బంగారు కుదువ వ్యాపారి (పాన్ బ్రోకర్)పై మోసం ఆరోపణలు కలకలం రేపాయి. తన వద్ద కుదువ పెట్టిన సుమారు అర్థ కిలో బంగారాన్ని తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ వికలాంగుడైన షామీర్ భాష కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగారు. బాధితుడి వివరాల ప్రకారం.. 2014లో హిందూపురానికి చెందిన పాన్ బ్రోకర్ భాస్కర్ వద్ద సుమారు అర్ధ కిలో బంగారాన్ని కుదువ పెట్టి రూ.11.70 లక్షలు తీసుకున్నాడు. అనంతరం అప్పు, వడ్డీ చెల్లించి తన బంగారాన్ని విడిపించుకునేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ బంగారం తిరిగి ఇవ్వలేదని షామీర్ భాష ఆరోపించారు. ఈ విషయమై హిందూపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్ను పలుమార్లు ఆశ్రయించినా న్యాయం జరగలేదని తెలిపారు. దీంతో బుధవారం సీపీఐ పట్టణ కార్యదర్శి కనిసెట్టిపల్లి వినోద్కుమార్ ఆధ్వర్యంలో షామీర్ భాష, ఆయన కుటుంబ సభ్యులు, సీపీఐ నాయకులు పాన్ బ్రోకర్ భాస్కర్ ఇంటి వద్ద బైఠాయించి నిరసన చేపట్టారు. కుదువ పెట్టిన బంగారాన్ని అసలు, వడ్డీ తీసుకుని వెంటనే తిరిగి ఇవ్వాలని, బాధితుడికి న్యాయం చేయాలని, పాన్ బ్రోక్స చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. దాదాపు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగింది. ఈ సందర్భంగా బంగారం అమ్మేశామని, ఏమైనా ఉంటే కోర్టును ఆశ్రయించుకోవాలని భాస్కర్, ఆయన భార్య చెప్పినట్లు బాధితులు ఆరోపించారు. బంగారం తిరిగి ఇచ్చే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని బాధిత కుటుంబ సభ్యులు, సీపీఐ నాయకులు స్పష్టం చేశారు.

# తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**పెనుకొండ ఆగస్టు12 మనం న్యూస్ :** పెనుకొండ తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ నిర్వహణ, ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కార ప్రక్రియ, మరియు వివిధ రెవెన్యూ రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజల నుండి వచ్చే వినతులు, సమస్యలను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రీ-సర్వే, భూ రికార్డుల ప్రక్షాళన, మరియు ఇతర రెవెన్యూ సేవల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యాలయ సిబ్బంది హాజరు రిజిస్టర్, మీ-సేవ ద్వారా వచ్చిన దరఖాస్తుల పురోగతి, మరియు పెండింగ్ ఫైళ్లను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్,పెనుకొండ మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్,తహసీల్దార్ స్వాతి,మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక పోరులో కూటమి జోరు.. గెలుపే లక్ష్యంగా సమరశంఖం



- కార్యకర్తలంతా ఏకతాటిపైకి రావాలి..
- ఇంటింటికీ వెళ్లి రెండేళ్ల అభివృద్ధిని వివరించాలి
- పుట్టపర్తిలో జోన్-5 కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి పిలుపు

**పుట్టపర్తి, ఆగస్టు 12 మనం న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా జోన్-5 టీడీపీ కోఆర్డినేటర్, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాస్రెడ్డి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. జోన్-5 కోఆర్డినేటర్గా నియమితులైన అనంతరం తొలిసారిగా సత్యసాయి జిల్లా పుట్టపర్తికి వచ్చిన శ్రీనివాస్రెడ్డికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్రెడ్డి ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయ పరిస్థితులు, నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు, ఇంటింటికీ టీడీపీ కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనపై చర్చించారు. పుట్టపర్తి జిల్లా కేంద్రంలో టీడీపీ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన, తదుపరి చేపట్టాల్సిన నిర్మాణ పనులపై కూడా చర్చించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు వంటి నిర్ణయాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. నియోజకవర్గంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పారిశ్రామిక పెట్టుబడుల ప్రతిపాదనలు, ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం గురించి మాజీ మంత్రి పల్లె రఘునాథ్రెడ్డి వివరించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కలిసికట్టుగా పనిచేయాలని శ్రీనివాస్రెడ్డి సూచించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మెజార్టీ స్థానాలను కూటమి అభ్యర్థులు గెలుచుకునేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ, మూర్తి, గంగాధర్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా సుబ్బర రామకృష్ణ



**అనంతపురం, ఆగస్టు 12: మనం న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా డాక్టర్.సుబ్బర రామకృష్ణ ని డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ తమామి అన్సారి రెండవసారి రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈ పదవిని రాష్ట్ర డైరెక్టర్ ఆఫీసు విద్యాభవన్ అమరావతి లో నిర్వర్తిస్తారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేయడం పట్ల రాష్ట్రంలోని వ్యాయామ ఉపాధ్యాయులు అందరూ హర్షం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా కు చెందిన డాక్టర్ సుబ్బర రామకృష్ణ ని నియమించడం పట్ల అనంతపురం జిల్లాలోని క్రీడాభిమానులు అందరూ హర్షం వ్యక్తం చేశారు.

# నేడు పుట్టపర్తిలో 'హర్ ఘర్ తిరంగా' భారీ ర్యాలీ



- జాతీయ జెండాలతో కదంతొక్కనున్న పుట్టపర్తి
- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి, ఆగస్టు 12 మనం న్యూస్ ;** హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తిలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఉదయం 9:30 గంటలకు పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగుతుందని వెల్లడించారు. జాతీయ ఐక్యత, దేశభక్తి, జాతీయ జెండా పట్ల గౌరవాన్ని చాటిచెప్పేలా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పుట్టపర్తి ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ర్యాలీకి పుట్టపర్తి ముస్తాబు... జాతీయ జెండాలతో పుట్టపర్తి వీధుల్లో దేశభక్తి నినాదాలు మార్మోగేలా భారీ ర్యాలీ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని 'హర్ ఘర్ తిరంగా' స్ఫూర్తిని చాటాలని కలెక్టర్ కోరారు

# నులు వేగవంతం చేస్తూ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలి

- అనంతపురంలో ఐ సి ఏ ఐ నూతన భవన నిర్మాణానికి స్థల పరిశీలన
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, కలెక్టరేట్ ఆగస్టు 12 : మనం న్యూస్** అనంతపురం నగరంలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ( ఐ సి ఏ ఐ ) సంస్థకు నూతన భవనాన్ని ఏర్పాటు చేసేందుకు మరో కీలక ముందడుగు పడింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నూతన భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. బుధవారం అనంతపురం నగరంలోని జేఎన్టీయూ మెయిన్ రోడ్డులోని సెరికల్చర్ కార్యాలయం సమీపంలో ఏపీఐఐసి ఆధ్వర్యంలో



సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఫ్లాట్టెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ - ఎఫ్ ఎఫ్ సి ) పరిసర ప్రాంతంలో ఐసిఏఐ ( ఐ సి ఏ ఐ ) నూతన భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా అధికారులు, ఏపీఐఐసి అధికారులు, ఐసిఏఐ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఏపీఐఐసి జోనల్ మేనేజర్ నాగకుమార్, డిప్యూటీ జోనల్ మేనేజర్ దేవకాంతమ్మ, ఏపీఐఐసి డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, ఐసిఏఐ ప్రతినిధులు తదితరులు స్థలాన్ని సందర్శించి, నూతన భవన నిర్మాణానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.

# పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**పెనుకొండ ఆగస్టు 12 మనం న్యూస్ :** పెనుకొండలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని వివిధ విభాగాలను నేరుగా పరిశీలించిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవలను సమీక్షించి వైద్యాధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగం, ఇన్-పేషెంట్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, డయాగ్నోస్టిక్ ల్యాబ్, ఫార్మసీ మరియు రికార్డులను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. వార్డులలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి, వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా లేదా, మందులు ఉచితంగా ఇస్తున్నారా అని ఆరా తీశారు.డాక్టర్లు, వైద్యాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ఆసుపత్రి గదులు మరియు అంతర్గత భాగాలకు



అవసరమైన మెరుగైన పెయింటింగ్ పనులు చేపట్టి, పరిశుభ్రతను పాటించాలని, వార్డులు, కారిడార్లు మరియు ఇతర ముఖ్యమైన విభాగాలలో సరైన నిఘా కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మానిటరింగ్ చేయాలని, అత్యవసర ప్రసూతి, నవజాత శిశు సంరక్షణ సేవల కోసం సిమాంక్ కేంద్రాన్ని అవసరమైన మౌలిక వసతులు మరియు సిబ్బందితో తక్షణమే అందుబాటులోకి తేవాలన్నారు. వైద్యులకు తగిన పని వాతావరణం ప్రత్యేక గదులు కేటాయించి, రోగుల సౌకర్యార్థం పేరు, హోదాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలి.ఎక్స్-రే సేవలు నిరంతరాయంగా అందేందుకు అవసరమైన 3 ఎక్స్-రే క్యాసెట్లను వెంటనే కొనుగోలు చేయాలని,ఉపయోగంలో లేని 104 అంబులెన్స్కు అవసరమైన మరమ్మత్తులు చేయించి, నిబంధనల ప్రకారం దానిని ' మహాప్రస్థానం వాహనంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, ఈ పనులన్నింటినీ ఆసుపత్రిలోని అందుబాటులో ఉన్న నిధులతో తక్షణమే పూర్తి చేసి, ఫోటో ఆధారాలతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్ కి సమర్పించాలని డీసీహెచ్ఎస్ కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్,పెనుకొండ మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్,పెనుకొండ తహసీల్దార్ స్వాతి,డిసిహెచ్ఎస్ మధుసూదన్,ఆసుపత్రి సూపరింటెండెంట్,వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

# దేశానికి గర్వకారణం.. గురుకుల ఆణిముత్యం రిష్విత!

- ఇటలీ సెయిలింగ్ ఛాంపియన్షిప్ విజేతలకు ఘన సత్కారం
- క్రమశిక్షణ, సమిష్టి కృషితోనే అంతర్జాతీయ ఖ్యాతి
- బీసీ సంక్షేమ, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, ఆగష్టు 12(మనం న్యూస్): అంతర్జాతీయ క్రీడా యవనికపై తెలంగాణకు చెందిన బీసీ గురుకుల విద్యార్థిని విశ్వరూపం ప్రదర్శించి దేశ కీర్తి పతాకాన్ని సగర్వంగా ఎగురవేసిన సంగతి విధితమే.. ఇటలీలోని ప్రసిద్ధ గార్డా సరస్సు వేదికగా గత నెల 30 నుండి ఈ నెల 7 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'సెయిలింగ్ ఇంటర్నేషనల్ కాడెట్ ప్రపంచ ఛాంపియన్షిప్ (ప్రమోషనల్ క్లాస్)'లో మహాత్మా జ్యోతిబాఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ నివాస విద్యాలయాల సంస్థ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) విద్యార్థిని ఎస్.రిష్విత రజత పతకంతో మెరిశారు. అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచిన రిష్వితతో పాటు, ఈ ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటిన మరో ఇద్దరు గురుకుల విద్యార్థులను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి వారికి శాలువాలు కప్పి, స్మారక చిహ్నాలతో ఘనంగా సత్కరించారు.

క్రీడా పాలసీతోనే గ్లోబల్ వేదికలపై పతకాలు:

ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. అంతర్జాతీయ క్రీడా వేదికలపై మన గురుకుల విద్యార్థులు పతకాల పంట పండించడం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా యావత్ భారతదేశానికి గర్వకారణమని ప్రశంసించారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన క్రీడా విధానం ద్వారానే గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభ వెలుగుచూస్తోందని, ఇలాంటి అంతర్జాతీయ సత్ఫలితాలు సాధ్యమవుతున్నాయని ఆయన స్పష్టంచేశారు. విద్యార్థులకు వారి ఆసక్తి గల క్రీడల్లో ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక ప్రోత్సాహం, అత్యాధునిక శిక్షణను వారు అద్భుతంగా సద్వినియోగం చేసుకుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. కఠినమైన క్రమశిక్షణ, సమయ పాలన, సమిష్టి కృషితోనే రిష్విత అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ఈ అరుదైన గుర్తింపు తీసుకువచ్చిందని మంత్రి కొనియాడారు. భవిష్యత్తులోనూ గురుకుల విద్యార్థులు క్రీడల్లో గ్లోబల్ స్టార్స్‌గా రాణించేందుకు ప్రభుత్వం అన్ని రకాల మద్దతునందిస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి (సెక్రటరీ) బి. సైదులు, క్రీడా విభాగం ఉన్నతాధికారులు, శిక్షకులు పాల్గొని విద్యార్థుల ప్రతిభను, వారి పట్టుదలను కొనియాడారు. సాధారణ గురుకుల పాఠశాలల నుండి అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్లు రూపుదిద్దుకోవడంపట్ల రాష్ట్రవ్యాప్తంగా సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## భర్త పాదాలకు పూజలు చేసిన టాలీవుడ్ హీరోయిన్





టాలీవుడ్ ఒకప్పటి స్టార్ హీరోయిన్ ప్రణీత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 2010 సమయంలో ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అందాల తార ప్రణీత, బావ సినిమాతో మంచి గుర్తింపు దక్కించుకున్నారు. ఆ తర్వాత అత్తారింటికి దారేది సినిమాలో స్పెషల్ రోల్ చేసి ఇరగదీశారు. హీరోయిన్ గా ఆమెకు పెద్దగా అవకాశాలు కలిసి రాకపోయినా...సెకండ్ హీరోయిన్ గా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. ఇక 2021లో బెంగళూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నితిన్ రాజును వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం తన ఫ్యామిలీతో జాలీగా గడుపుతున్న ప్రణీత, సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటారు.

తాను చేసే ఆక్టివిటీని సోషల్ మీడియాలో నిత్యం పంచుకుంటూ ఉంటారు. ఈ తరుణంలోనే తన భర్త పాదాలకు పూజ చేస్తూ నమస్కరించిన ఓ ఫోటోను నటి ప్రణీత సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దానికి భీమన అమావాస్య అనే క్యాప్షన్ కూడా ఇచ్చారు. ఈ భీమన అమావాస్య అనేది కర్ణాటకతో పాటు దక్షిణాదిలోని పలు ప్రాంతాలలో జరుపుకునే హిందూ సంప్రదాయ పండుగ. ఆ రోజున భర్త ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మహిళలు పూజలు చేస్తారు. ఆషాడ మాసంలో చివరి రోజున అమావాస్య నాడు ఈ పండుగను జరుపుకుంటారు. ఇందులో భాగంగానే తన భర్త నితిన్ రాజుకు పూజ చేసిన ఫోటోను నటి ప్రణీత పంచుకున్నారు. గతంలో కూడా ఇలాగే పూజలు చేసిన ఆమె, ఫోటోలు షేర్ చేశారు.




## ఇటీవలే క్రికెట్‌కు గుడ్ బై.. కొత్త పాత్రలోకి అజింక్య రహానే

భారత మాజీ క్రికెటర్ అజింక్య రహానే కొత్త పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యాడు. ఇటీవలే క్రికెట్ కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. టీమ్‌ఇండియా తరఫున పదిహేనేళ్లపాటు క్రికెట్ ఆడాడు. ఐపీఎల్ లోనూ ప్రాతినిధ్యం వహించాడు. ఆటకు గుడ్ బై చెప్పిన తర్వాత ఏం చేస్తాడనేదానికి సమాధానం దొరికింది. మరో మూడు రోజుల్లో శ్రీలంక - భారత్ జట్ల మధ్య టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కు వ్యాఖ్యాతగా అజింక్య రహానే వ్యవహరించనున్నాడు. ఈ మేరకు రహానే, సోనీ స్పోర్ట్స్ నెట్ వర్క్స్ సీఆర్వో, బిజినెస్ హెడ్ రాజేశ్ కౌల్ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. తమ కామెంట్రీ ప్యానల్ లోకి రహానేను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు రాజేశ్ తెలిపారు.



''భారత్ - శ్రీలంక జట్ల మధ్య టెస్టు సిరీస్ కు వ్యాఖ్యాతగా అరంగేంట్రం చేయనుండటం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది. క్రికెట్లో టెస్టు ఫార్మాట్ కు తిరుగులేదు. భారత్ తరఫున కొన్నేళ్లు టెస్టు మ్యాచులు ఆడా. ఇప్పుడు ఆటను మరో కోణంలో చూడబోతున్నా. నా అనుభవాలు, ఆటలోని మలుపులను అభిమానుల ముందుకు తీసుకొస్తా. నా బ్రాడ్ కాస్ట్ అనుభవం ఫ్యాన్స్ ను అలరిస్తుందని అనుకుంటున్నా'' అని రహానే వెల్లడించాడు.

## ఈ ఆగ్రహానికి కారణమేంటో అర్థం కావట్లేదు: పీవీ సింధు



ఆగస్టు 17 నుంచి ప్రారంభంకానున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలకు దిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఇండియా ఓపెన్ సమయంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సారి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ప్రత్యేక చర్యలు చేపట్టింది. కోతుల బెడదను నివారించేందుకు లంగూర్ల (కొండ ముచ్చులు) శబ్దాలను అనుకరించే ముగ్గురు నిపుణులను నియమించింది. ఈ చర్యపై సోషల్ మీడియాలో కొందరు వ్యంగ్యంగా స్పందించగా వారికి భారత స్టార్ షట్లర్ పి.వి. సింధు కౌంటర్ ఇస్తూ నిర్వాహకులు చేపట్టిన ప్రయత్నాలను మెచ్చుకున్నారు. 'ఈ పరిష్కారాన్ని చూసి కొందరు నవ్వొచ్చు. కానీ, వారి (బీఏఐ) కృషిని అభినందించాలి' అని ఎక్స్లో పోస్టు పెట్టారు. సింధు పోస్టుకు కొంతమంది నెటిజన్లు 'కోతుల సంగతి పక్కన పెట్టు.. ముందు టోర్నమెంట్లో బాగా ఆడటంపై దృష్టిపెట్టు'' అని కామెంట్లు పెట్టారు. ఆ కామెంట్లపై సింధు స్పందించారు. టోర్నమెంట్లో మంచి ప్రదర్శన చేయడానికి వంద శాతం కృషి చేస్తానని.. కానీ ఈ ఆగ్రహానికి కారణమేంటో అర్థం కావట్లేదని పేర్కొన్నారు. వింబుల్డన్లో కోర్టులను పావురాలు రెట్టలతో పాడు చేయకుండా ఉండేందుకు డేగను సెక్యూరిటీగా పెట్టారని గుర్తుచేశారు. ప్రపంచంలో ఎక్కడైనా ప్రధాన క్రీడా ఈవెంట్లను నిర్వహించేటప్పుడు స్థానికంగా కొన్ని సవాళ్లు ఉంటాయన్నారు. టోర్నమెంట్ కు ఎలాంటి ఆటంకాలు కలగొద్దనే ఉద్దేశంతో కోతుల బెడదను నివారించేందుకు చేసిన ఏర్పాటును ఎందుకు చర్చనీయాంశం చేస్తున్నారో తనకు అర్థం కావడం లేదని సింధు పేర్కొన్నారు.

## మీకు అభిమానులు వద్దా.. జాన్వీకపూర్ పిటిషన్ పై హైకోర్టు

నటి జాన్వీ కపూర్ తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం దాఖలు చేసిన పిటిషన్ పై దిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియాలో ఉన్న ఆమె ఫ్యాన్ క్లబ్ లు, అభిమానుల పేజీలపై పూర్తిస్థాయిలో నిషేధం విధించేందుకు కోర్టు నిరాకరించింది. జాన్వీపైఅభ్యంతరకర వ్యాఖ్యలు, విమర్శలతో పాటు, డీప్ఫేక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి అశ్లీల కంటెంట్ తయారు చేస్తున్నారని ఆమె తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వీటికి సంబంధించిన కొన్ని ఫ్యాన్ పేజీ లింక్ లతో పాటు 4000 వెబ్ సైట్ లింక్ లను కూడా కోర్టుకు సమర్పించారు.

దీనిపై దిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. విమర్శలు, ఆన్ లైన్ దూషణలు ప్రజా జీవితంలో భాగమైపోయాయని పేర్కొంటూ .. ఆమెకు సంబంధించిన అన్ని అభిమాన సంఘాలపై నిషేధం విధించడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ''అశ్లీలత, తీవ్రమైన అభ్యంతరకర కంటెంట్ ఉంటే చర్యలు తీసుకోవచ్చు. కానీ అన్ని ఫ్యాన్ క్లబ్ లను ఎలా మూసివేయగలం?'' అని ప్రశ్నించింది. అన్ని ఫ్యాన్ పేజీలు తప్పుగా ప్రవర్తించడం లేదని, కొన్ని కేవలం అభిమానంతోనే క్రియేట్ చేసి ఉండొచ్చని కోర్టు అభిప్రాయపడింది. ఈ సందర్భంగా 'మీకు అభిమానులు వద్దా?' అని ప్రశ్నించిన కోర్టు.. ఫ్యాన్ పేజీలన్నింటినీ చట్టవిరుద్ధమైనవిగా పరిగణించలేమని స్పష్టం చేసింది.



## సినిమాల్లో అవకాశాలు రావని భయపడ్డా: సమంత

నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. ''మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్ట్ లతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను'' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీసిరీస్ లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్నికలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా, హీరోయిన్స్ కూడా అన్నిచేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా, సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుంది'' అని పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స విజయవంతం



ప్రముఖ నటుడు ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైనట్లు హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులెటిన్ లో తెలిపాయి. ప్రత్యేక వైద్యనిపుణుల బృందం ఆయనకు ఆర్థోస్కోపిక్ సర్జరీని నిర్వహించినట్లు వెల్లడించాయి. ఎన్టీఆర్ ఆరోగ్యంగా ఉన్నారని, ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు పేర్కొన్నాయి. రెండు, మూడు నెలల్లో ఆయన పూర్తిగా కోలుకుంటారని వైద్యబృందం తెలిపింది. ఇటీవల జిమ్ లో కసరత్తులు చేస్తుండగా, ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ప్రస్తుతం ఆయన ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న 'డ్రాగన్'లో నటిస్తున్న సంగతి తెలిసిందే.

## 'ఇరుముడి' ట్రైలర్ రిలీజ్..ఇరగదీసిన రవితేజ



మాస్ మహారాజా రవితేజ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా సినిమా ఇరుముడి. ప్రియా భవాని శంకర్, సాయి కుమార్ ప్రత్యేక పాత్రలలో కనిపించనున్న ఈ ఇరుముడి సినిమాకు శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. జీవి ప్రకాశ్ సంగీత స్వరాలు సమకూర్చారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో వచ్చిన ఈ సినిమా ట్రైలర్ తాజాగా రిలీజ్ అయింది.

ఇందులో తండ్రి సెంటిమెంట్, రవితేజ డైలాగ్స్ అదిరిపోయాయి. రవితేజతో పాటు కూతురు పాత్ర చేసిన బేబీ నక్షత్ర కూడా అదరగొట్టింది. ఇక ఈ ట్రైలర్ లో జీవి ప్రకాశ్ ఆఎస ఇరగదీశారు. తాజాగా విడుదలైన ఈ ట్రైలర్, ఇరుముడి సినిమాకు హైప్ తీసుకువచ్చింది. మరి థియేటర్లలో జనాలను ఏ మాత్రం ఆకట్టుకుంటుందో చూడాలి. భక్తి నేపథ్యంలో వస్తున్న ఈ సినిమా ఈనెల 21వ తేదీన థియేటర్స్ లలో విడుదల కానుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.